మండలి మునులం జూడఁ గోరి యతనియొద్ద సవినయంబుగ సెలవుం గైకొని శ్రీరాముఁడు దండకారణ్యంబునకుం బయున మయ్యె. సీతారామలక్ష్మణులు దండకవనమండలి మున్యా శ్రమంబు లన్నియు దర్శించుచుఁ బది సంవత్సరము లచ్చటఁ గాలక్షేపంబు సేసి మరల సుతీక్ష్ణాశ్రమముం జేరిరి. వారు సకలమునీంద్రులను సందర్శించిరి కాని, యగస్త్యముని దర్శ నంబు మాత్రము వారికి లభింపకపోయెను. వారు మరల సుతీ క్ష్ణుని యనుజ్ఞం గైకొని యగస్త్యమహాముని యాశ్రమంబు నకుం బోయిరి. అగస్త్యముని ఋషులలో మిగుల గొప్ప వాఁడు. అతం డనేకాద్భుతకార్యంబు లొనరించినవాఁడు. సముద్రం బంతయు నొక్క గ్రుక్కఁగాఁ గ్రోలెను; ఇల్వల వాతాపు లను రాక్షసద్వయంబును మిగులఁ జమత్కారం బునఁ జంపెను. ఇల్వలుండును వాతాపియు నన్నదమ్ములు. ప్రతిదినంబును బ్రాహ్మణులం జంపి తినుటయే వారి పని. ఇల్వ లుండు బ్రాహ్మణవేషంబు ధరించి సంస్కృతభాషణంబు లాడుచు దారిం బోవు విప్రుల మోసపుచ్చి తన గృహంబు నకుం దీసికొనిపోయి వారికి మేఁక మాంస మాహారంబుగ నిచ్చువాఁడు. అతని సోదరుం డగు వాతాపియే యా మేష స్వరూపముం దాల్చెడివాఁడు. బ్రాహ్మణభోజనానంతరం బిల్వలుండు 'వాతాపీ' యని తమ్మునిం బిలువఁగనే యతండు బ్రాహ్మణుని యుదరంబు వ్రక్కలు చేసికొని వెల్వడెడివాఁడు. వా రుభయులు నీమాటు చంపెడి విప్రుల మెక్కుచుండు వారు. ఈ క్రూరాత్ములం జంప నెంచి యగస్త్యుండు భోజ నార్థమై వారి గృహంబున కేఁగెను. యథాప్రకార మిల్వలుం

డగస్త్యునకు భోజనంబు పెట్టి 'వాతాపీ' యని పిలిచెను. అగస్త్యముని "వాతాపి యెక్కడనుండి వచ్చును? వానిని నేను గర్భంబున జీర్ణము చేసికొంటి" నని బదులు చెప్పెను. ఆ వాక్యంబులు విని యిల్వలుం డగస్త్యుం జంపఁబోయెను. కాని, కుంభసంభవుం డిల్వలుని వంకఁ దీక్ష్ణదృష్టిం జూచి వాని భస్మీభూతునిం గావించె.

అట్టి మహిమతోఁ గూడిన యగస్త్యుండు విశ్వకర్మ నిర్మితంబు లగు కార్ముకము ఖడ్గము మొదలగు కొన్ని యస్త్రములు శ్రీరామునికిం బారితోషికంబులుగ నొసంగె. శ్రీరాముఁ డగస్త్యునకుం బ్రణమిల్లి "యందమయిన యొక నిర్మలస్థలంబు చూపుఁ" డని ప్రార్థించె. అతండు "పంచవటీవనంబు సముంచితం" బని వచించె.

అంతట సీతారామలక్ష్మణులు నానావిధఫలపుష్పలతావితానంబులచే నలంకరింపఁబడి చల్లని తావుల వెదఁజల్లు తరుసంతానంబులతోడను సరోవరనికరంబులతోడను జెలువొందుచు వాసయోగ్యంబుగ నున్న పంచవటీ ప్రాంతమునకుం బ్రయాణ మైరి. మార్గమధ్యంబున వారికి జటాయు వను నొక పక్షివరుండు కాన్పించె. ఆ పక్షిరాజుం జూచి శ్రీరాముఁడు "నీ వృత్తాంతము జెలియింపు" మన "నేను జటాయువను; నీ జనకుని మిత్రుండను; నా సోదరుని పేరు సంపాతి; గరుడుండు మా పెద్దతండ్రి; మీరు నాయొద్దనే యుండుఁడు. మీరు కందమూలఫలాదులకై వనంబునం గ్రుమ్మరు సమయంబున నేను సీతాదేవిం గాచుచుండెద" నని ప్రత్యుత్తర మిచ్చెను.

రామలక్ష్మణులు జటాయువునకు నమస్కరించి యతని సాదరవాక్యంబులకు సంతుష్టాంతరంగులైరి. ఆ స్థలం బత్యంత రమణీయంబుగ నుండెను. దగ్గఱనే గోదావరి ప్రవహించుచుండెను. హంస సారస మయూర క్రౌంచాది నానావిధ పక్షిజాతంబు గౌతమీప్రవాహంబున విహరించుచుండెను. ఇరుప్రక్కల దివ్యమైన పర్వతంబులు ఫలపుష్పలతావృతంబులగు వృక్షంబులు విరాజిల్లుచుండె. హరిణంబులు నిర్మలోదకంబు ద్రావుచు స్వేచ్ఛావృత్తిం జరించుచుండె. మయూరంబులు వృక్షాగ్రంబుల నధిరోహించి షడ్జమస్వరంబుల వనలక్ష్మి కానందంబు సంధించుచుండె. కోకిలలు తమ మధుర కంఠస్వనంబులతో నధ్వగులకు శ్రవణానందంబుగ స్వాగతం బొసంగుచున్నట్లుండె. ఇట్టి యాహ్లాదకరం బగు స్థలంబున నివసించుట కెవ్వరి కిచ్ఛ జనింపదు? అచ్చో లక్ష్మణుం డొక యాకుటింటిని నిర్మింప వా రందు నివసించిరి.

ఇట్లు వా రానందాంబుధిని మునింగి యుండ, విధిప్రేరణంబున దుఃఖకారకురా లగు శూర్పణఖ యయ్యెడ కేతెంచె. రావణసోదరి యగు శూర్పణఖ శ్రీరామునిం జూచి మోహించి "నన్ను వివాహంబు చేసికొ" మ్మని యతనిం గోరెను. అందుల కతండు "సుందరీమణీ! నాకుం బత్ని యున్నది. నీవు పోయి రూపవంతుం డగు నా తమ్ముని వరింపు" మని మందహాసపురస్సరంబుగ వచించె.

ఆ మాటలు నిజ మనుకొని శూర్పణఖ లక్ష్మణుని యొద్ద కేఁగి తన మనోభిలాషంబు వ్యక్తీకరించె. అంత నతం "డింతీ! నేను శ్రీరాముని దాసుండను. నన్నుం జేపట్టిన నీవు

సతని దాసి వగుదువు. దాన నీకు లాభంబు లేదు. కనుక నీవు శ్రీరామునే వివాహము చేసికొనిన, నేను నీకుఁ గూడఁ బరిచర్య సల్పుదు" నని పలికి దానిం బంపివైచె.

లక్ష్మణుని వాక్యంబు లాలించి శూర్పణఖ మరల శ్రీరామునియొద్ద కరుగ, అతండు సమ్మతింపకపోయెను. అపుడది యాగ్రహపరవశురాలై "ఈ సీత చెంత నున్నంతవఱకు రాముఁడు నన్నుఁ జేకొనం" డని యెంచి సీతాదేవిం జంప నుంకించె. లక్ష్మణుండు రామానుజ్ఞాతుండై దాని కర్ణనాసికంబులం గోసివైచె. అంతట రక్కసి మిక్కుటంబుగ రోదనంబు సేయుచు సమీపజనస్థానమం దున్న సోదరుం డగు ఖరునికడకుం బోయె. అతండు శూర్పణఖ యవస్థం గాంచి క్రుద్ధుండై "ఇది యేమి? ఎవ్వరు నిన్నిట్లు వికృతరూపిణిం గావించిరి? త్వరితంబ చెప్పుము. వారిని నేను ఖండించి తగిన శిక్ష గావించెద" ననియె.

శూర్పణఖ రోదనంబు సేయుచుఁ దన పరాభవప్రకారంబు సర్వంబు దెలియఁబఱిచి రామలక్ష్మణుల రక్తముం దనకుఁ ద్రావఁ దెచ్చి యిమ్మని సోదరుం బ్రార్థించె. అపుడు ఖరుండు పదునల్వుర రాక్షసులను "శ్రీరాముం జంపి రం" డని యాజ్ఞాపించె. వా రల్లే శూర్పణఖతో నచ్చటికిం బోయిరి. ఘోరరాక్షససంహారంబు గావించిన శ్రీరామున కీ రాక్షసు లెంతటివారు? రౌద్రాకారంబుల నేతెంచిన ఖరప్రేరితులగు రాక్షసులతో యుద్ధంబు చేసి రామలక్ష్మణులు వారిం బరిమార్చిరి. రాక్షసులు యమపురంబు చేరినతోడనే శూర్పణఖ త్వరితంబుగఁ దన సోదరుని కడకు మరలఁ బోయెను.

దానిం జూచి ఖరుండు "ఏమి జరగినది? రాముని రాక్షసులు చంపిరా?" యనుడు, "అన్నా! నీచే నియుక్తులైన రాక్షసులు నిహతులైరి. కావున నీవే వారిం దునుమాడ ర" మ్మని యది బలవంతపఱచె. అతండు చతుర్దశసహస్రసేనాపరివృతుండై శ్రీరాము మార్కొనం బోయె.

శ్రీరాముఁడు వారి రాకం గాంచి సీతాదేవిని లక్ష్మణునితో నొకపర్వతగుహకుం బంపి తానే యుద్ధము సేయుటకు సంసిద్ధుఁ డయ్యెను. దైత్యు లందఱు శ్రీరామచంద్రునిపై శరపరంపరలు గురియింప దొరంకొనిరి. కాని, యతం డందఱు నాశ్చర్యపడునట్లు యుద్ధంబున నందఱం దెగటార్చెను. యుద్ధంబు పరిసమాప్తి కావేగమే సౌమిత్రి సీతం దోడ్కొని వచ్చి రాముని సన్నిధానముం జేర్చె. సోత్కంఠంబుగ నాథునిం గౌఁగిలించుకొని సీత సుప్రీత యయ్యెను. అంతట, శూర్పణఖ రయంబున లంకకుం జని తన యన్న యగు రావణుని సన్నిధి కేఁగ, దశకంఠుం డా యువిదం గాంచి "నిన్నిట్లు చేసినవాఁ డెవండు? శక్రుఁడా? చక్రధరుఁడా? నన్నుం గానక నిన్నిట్లు పరాభవించినవాఁ డెవండో నుడువుము. నేను వానిని యమాలయంబునకుం బంపెద" నని ముద్దుచెల్లెలి నోదార్చె. అపు డా రక్కసి "నా వికృతరూపమునకుం గారకుండు రాముఁ డను రాజకుమారుండు. అతండే జనస్థానంబునందలి సర్వరాక్షసగణంబును ఖరత్రిశిరసమేతంబుగాఁ బొరిగొనియె" నని దీనాలాపంబులం బలికె. రావణుం డత్యుగ్రుండై "ఆ రాముఁ డెవండో? అసురుల నెందులకుం జంపెనో? తెలిసికొందు" నని పండ్లు పటపటం గొఱికె.

మఱియు, శూర్పణఖ భువనమోహిని యగు సీతాదేవి సౌందర్యంబును బొగడుచు "అన్నా! యామెను నీకు భార్యగాఁ జేయ నెంచి తదర్థమై పోవుటం జేసియె నాకును దక్కిన రాక్షసులకు నీవిపత్తు ప్రాప్తించె" నని యతని శత్రుసంహారదీక్ష నినుమడించె. సీత నెట్లయినం దనకుఁ గూర్పు మని పరిపరివిధంబుల రావణుండు చెల్లెలిం గోరి, ఆమె నపహరించు పన్నాగంబున మారీచునికడకుం బోయె. మారీచుం డెన్ని విధంబుల శ్రీరామమాహాత్మ్యంబును బోధించి సీతాపహరణప్రయత్నంబు వల దనినను, రావణుండు వినకపోయెను. మఱియు, శ్రీరాముండు బాల్యావస్థలోనే రాక్షసుల వధించి తన్నొక బాణంబున నిశ్చేష్టితు నొనరించి యబ్ధిలోఁ బడవైచె ననియు నప్పటినుండి కౌసల్యాసుతుం డనినఁ గడు భయంబున వీక్షించుచుండు ననియు మారీచుండు చెప్పెను గాని, రావణుం డతని హితవాక్యంబు లించుకయు నాలింపఁడయ్యె. రోగి కౌషధముంబోలె మారీచుని హితవాక్యంబులు రావణునకు రుచింపవయ్యె. ఎంత చెప్పినను వినక "మారీచా! నీ వీ పని తప్పక నెఱవేర్పవలయు; నీవు బంగరు లేడి వేషంబున రాముని యాశ్రమంబుకడం జరించుచుండుము. నిన్నుం జూడఁగనే సీతాదేవి నీకొఱకు రామలక్ష్మణులం బంపును; నిన్నా రాముఁడు వెంటాడునపుడు 'హా! లక్ష్మణా! హా! సీతా!' యని యఱవుము. ఆ వెంటనే నే నామె నెత్తుకొని వచ్చెద. నీ వటు చేయనియెడ నిన్నిప్పుడే చంపివైచెద" నని రావణుం డతని బెదరించెను. "ఈ దైత్యునిచేతం జచ్చుట కన్న శ్రీరామునిచేతనే చచ్చుట మేలు, మోక్షము లభింపఁ

గల" దని యెంచి మారీచుండు హరిణరూపంబున రామాశ్రమంబునకుం బోయెను. సీతాదేవి పుష్పాపచయం బొనర్చు తఱి నా మాయలేడి యామె సమ్ముఖమ్మున నాటలాడఁ జొచ్చె. సీతాదేవి దానిం గాంచి విస్మయం బంది "హరిణంబు నెటులైనం బట్టితె" మ్మని శ్రీరాముం గోరెను. అంతట లక్ష్మణుండు రాముని ప్రయత్నంబు గ్రహించి "అగ్రజా! స్వర్ణహరిణం బెచ్చట నైన నుండునా? ఇది తాటకాపుత్త్రుండగు మారీచుని పని యై యుండును. ఈ దుష్టుం డప్పుడప్పుడీ వేషంబున నే వచ్చి మునులం జంపుచుండు నని చెప్పికొందు" రని యతనిని వారింపఁబూనెను.

శ్రీరాముఁడు జానకి వాంఛం దీర్పసమకట్టి "లక్ష్మణా! నీ వదినెం గాపాడుచుండుము. ఈ సారంగముం బట్టి తెచ్చెద" నని ధనుర్బాణపాణి యై దాని వెంబడించె. అతఁడు నడచినఁ బరువిడిన నది యెడ యగుచుఁ, గొంత తడవు చేతికందునట్లును మరికొంత తడవు కడు దూరం బేఁగునట్లును గాన్పించుచుండె; నడుమ నడుమ నదృశ్యం బగుచుండె. ఇట్లది శ్రీరాముని నలసట పాల్సేయ నతం 'డిక నూరకుండిన ఫలంబు లే' దని యెంచి తీవ్రం బగు నొక నారాచంబును సారంగంబు పైఁ బ్రయోగించె. ఆ శరంబు తిరంబుగ మేన నాటినందునం గురంగంబు తన తొంటి మారీచరూపముం గైకొని "హా లక్ష్మణా! హా సీతా!" యని పెద్ద యెలుంగున నఱచి క్రిందం బడి వెంటనె ప్రాణంబులు విడిచె. అంత శ్రీరాముఁడు 'ఆహా! యీ ధ్వని విని సీత యాతురతతో నాకడకు నా తమ్మునిం బో మ్మనును. సీత యొంటిపాటున నేమి కీడు

మూఁడునో? వేగంబ పోవలయు' నని సత్వరంబుగ తిరిగి వచ్చుచుండె. అంతలో, సీత రాక్షసమాయా కూరావంబును విని 'నా భర్తయే యిట్లు పిలిచియుండ నోపు. అతని కేమి యిక్కట్టు సంభవించెనో?' యని యెంచి విచారించి ముద్దు మఱందిం జూచి, "సౌమిత్రీ! నీ యన్న యెన్నండును లేని దీనత్వంబున నిన్నును నన్నును జీరె. అతని కేమి యాపద సంభవించెనో? నీవు వేగంబ చనవలయు" నని మందలించె. ఆ యఱపులు రాక్షసమాయగా లక్ష్మణుం డూహించి, "అది మా యన్న కంఠస్వరంబు కాదు. అతని కేమియుం జిక్కు తటస్థించియుండదు. నీ వించుకయుఁ గింత నొందకు" మని యూఱడింపఁజూచెను. తా నెన్ని విధంబులఁ దర్కపెట్టిన నతండు వినకుండుటం గాంచి "నీ యన్న ప్రాణంబులు విడిచిన నీవు సుఖంబుగ నుండవచ్చు నని తలంచితివా? నీ కింతేనియు విచారంబు లేదా? పాపాత్ముఁడా! నీవంటి యనుజుం డుండిన నపకీర్తి పా లగుట వింతయా? నీ మనంబునఁ గల కోరిక నా కిప్పుడు తెలిసినది. ఛీ! నీ మొగముం జూడరా" దని సీత యతని నిందించెను. లక్ష్మణుం డందులకుఁ దన మనంబునఁ గటకటంబడి "తల్లీ! శ్రీరాముని ప్రభావంబు నే నెఱుంగనిది కాదు. అతని నెవ్వరుం జంపఁజాలరు. నిన్నుం గాచుచుండు మని మా యన్న నన్ను నియమించిన కారణమున నేను నిన్ను వదలి పోవుట యధర్మంబు. నీవు భయంపడకుము. శ్రీరాముఁ డిప్పుడ యేతెంచు" నని సమాధానంబు చెప్పె. ఆమె మఱింత పరుషంబుగ నతని నిందించె. లక్ష్మణుండు క్రుద్ధుండై "అమ్మా! నేను నిన్ను నా తల్లింబోలె ప్రేమించు

చున్నాఁడ. నాయెడ నీకిపు డెప్పు డుండెడు భావము లేదు. నేఁ డేమో విపరీత వాక్యంబులు నీనోట వెల్వడుచున్నవి. శివశివా! నీ వచనంబులు వినంజాల. ఇప్పుడె శ్రీరామాన్వేష ణార్థం బరిగెద" నని బయులు దేఱి 'ఆహా! సీతాదేవి నొంటిగ విడిచి యగ్రజుని వాక్యంబులకు విరుద్ధంబుగ నే నేఁగు చున్నాఁడ. యెట్టి యిక్కట్టు సంభవింప నున్నదో?' యని విచారించుచుం బోయెను. సమయంబు వేచియున్న లంకే శ్వరుండు సన్న్యాసివేషంబు దాల్చి పర్ణకుటీరద్వారమునకుం జని సీతతోఁ గపటసంభాషణంబు సలుపం దొడంగె. ఆమె యతండు నిజంబుగ బ్రాహ్మణ సన్న్యాసియే యనుకొనెం గాని మాయావి యనియుం దన్ను వచింప నేతెంచె నని యుం దలంపదయ్యె. యోగికి వందనంబు లర్పించి శ్రీరామ లక్ష్మణులు వచ్చువంతవఱ కచ్చటనే యుండుం డని కూర్చుం డుట కొఱకు కుశాసనం బొసంగి తినుం డని కొన్ని ఫలంబు లొసంగి సీత వానికిం దగిన సత్కారంబు లొనరించెను.

అంతట, రావణుండు సీతాదేవిం గాంచి "రాజ్య భ్రష్టుఁ డగు రామునితో నీ యరణ్యంబున నెందుల కిక్కట్ల పా లయ్యెదవు. లంకాపురాధీశ్వరుండ నగు నన్నుం గూడి యానం దింపుము. నాతో ర" మ్మని నిజాభిలాషం జెలంగించెను. అంత, జానకి భయాతిరేకంబున నిశ్చేష్టయై కొంతవడికిం దెప్పిఱిలి "ఓరీ! పాపీ! నే నొంటిగ నున్నప్పు డేల యిట్లు ప్రేలెదవు? ఆఁగు మాఁగుము! శ్రీరాముఁ డనుజసమేతుం డై వచ్చి నిన్నుం దునుమాడు" ననియె. వెంటనే దైత్యవల్లభుండు పది శిరంబులు నిరువది కరంబులుఁ గల తన భీకరాకారముం

జూచి సీత భయం బంది మూర్ఛిల్లెను. అతం డామె నెత్తుకొని రథంబునం జెట్టుకొని లంకకుం బయన మయ్యె. భూజాత కొంతసేపటికిఁ జైతన్యం బంది మిక్కుటంబుగ దుఃఖించుచు నా క్రూరాత్ముని హస్తముల నుండి తప్పించుకొనఁ జూచెం గాని యయ్యది సాధ్యము కాకపోయెను. తుదకు సీత గత్యంతరంబు గానక "ఓ సురలారా! మునులారా! ధరణీదేవులారా! ధన్యాత్ములారా! నన్నీ రావణుండు బలవంతముగఁ గొనిపోవుచున్న యుదంతము శ్రీరామున కెఱింగించి నన్ను రక్షింపుఁ" డని యాక్రందింపఁదొడంగె. ఆ యార్తనాదంబు విని నిద్రించుచున్న జటాయువు లేచి రావణుండు సీత నెత్తుకొని పోవుచుండుటం దెలిసికొని వానితో యుద్ధంబు సేయఁగడంగె. ఆ ఘోరం బగు యుద్ధంబున జటాయువు రావణుని రథంబును సారథిని ఛత్రంబు మొదలగు వానిని ధ్వంసము చేసె. రావణునితో నెంత తడవు యుద్ధంబు చేసినం బ్రయోజనంబు లేకపోయె. ఒక చేత ఖడ్గంబు నొక చేత సీతాదేవి నెత్తుకొని రావణుఁడు పాఱిపోవఁజొచ్చె. జటాయువు మరల యుద్ధంబునకు సన్నద్ధుఁ డయ్యెం గాని గెలువఁ జాలం డయ్యె. ఎన్నిసారులు తలలు నఱికినను మరల నవి మొలకలెత్తుచుండుట వలన నతని శ్రమంబు ఫలింపక పోయె. సీత హతాశ యయ్యె. అట్టియెడ నామె దుఃఖించిన దుఃఖమునకు మేర యుండునా? ఎవ్వరికిఁ జెప్పుకొనును? అయ్యది నిర్జన ప్రదేశంబు. అట్లాకసంబు మీఁదుగ రావణుండు తన్నుం గొని పోవుచుండ, నొక పర్వతంబున నయిదు వానరంబు లుండుటం జూచి తన పయంట కొంసం జించి దానిలోఁ దన యాభరణం

బులం గట్టి యా మాటను వాని సమీపంబునం బడవైచె.

శ్రీరాముఁడు మారీచుం జంపి వచ్చుచు లక్ష్మణునిం జూచి "ఏమి లక్ష్మణా! సీతను వదలి యిట్లు వచ్చుచున్నావు ? ఆమె కేమయిన నాపద సంభవించు నేమో!" యనుచు భయభ్రాంతుండై త్వరితంబుగఁ బర్ణశాలకు వచ్చి చూడ సీత కాన్పింపదయ్యె. "ఆహా! సీత యెందుఁ బోయెను? ఎక్కడ నైన డాఁగెనా? స్నానార్థంబు పుష్కరంబునకుం బోయెనా?" యని శంకించుచుఁ బర్వతంబులందును నదీతీరములందును వృక్షగుల్మలతాదులందును రామలక్ష్మణు లామెను వెదక నారంభించిరి. ఆమె యెచ్చటం గాన్పింపదయ్యె. అంత, రాముఁడు మిగుల దుఃఖితుఁడై "తరులారా! హరులారా! కరులారా! నా తరలాక్షిం గంటిరే? పూర్ణచంద్రవదనా! కోమలాంగీ! నాపైఁ గోపమా ? పలుక వేటి?" కని యున్మాదం బతిశయిల్లఁ బెక్కుభంగుల విలపింపసాగెను.

అట్లు విలపించుచు రాముఁడు సీతాన్వేషణంబు సేయుచుండ జటాయు వగపడెను, రామలక్ష్మణులు గుర్తింపలేక "యీ పక్షియే సీతను జంపి యుండు" నని దానిం జంప నుంకించిరి. "నేను జటాయువను; దశవదనుండు జనకజం గొనిపోవుచుండ వాని రథంబు భగ్నంబు సేసితి. రావణుండు న న్నస్త్రమునం గొట్టుటచే ఱెక్కలు ముక్కలయినవి. రామా! ఇఁక నాకు నీవే శరణంబు" వని యా పక్షీంద్రుండు ప్రాణంబులు విడిచె. అంతట, శ్రీరామచంద్రుండు కాష్ఠంబులచేఁ జితిం బేర్చి యా పులుంగున కతిశ్రద్ధతో దహనకర్మం బొనరించె. రామున కపుడు దశరథుని

మరణవార్త వినినప్పటి దుఃఖంబు సంప్రాప్తమయ్యె. దహన క్రియానంతరంబు వా రరణ్యమధ్యంబునఁ బోవుచుండ వికృతాకారుం డగు నొక దైత్యుండు వారికిఁ గాన్పించె. వానికిఁ దలయుం గన్నులును వక్షోభాగంబున నుండె. వాని బాహువులు శతయోజనదీర్ఘంబులు. వాని పేరు కబంధుండు. వాఁ డా కరంబులతో రామలక్ష్మణులం బట్టుకొని తన యుదర మధ్యమున నున్న దంతంబులతో నమలి తినంబోవ రామలక్ష్మణులు వాని హస్తంబులను ఖండించిరి.

అపు డా రాక్షసుండు వారిని రామలక్ష్మణులుగా గ్రహించి తన్ను దహింపుఁ డని యభ్యర్థించి వారిచే దహింపఁబడి దివ్యసుందరరూపముం దాల్చి రామునితో ని ట్లనియె. "అయ్యా! నేను గంధర్వుండను. ఒకానొక దినంబున రాక్షసరూపంబు దాల్చి స్థూలశిరముని భయపెట్టఁబోవ న 'న్నట్లే యుండు' మని యతండు శపించెను. నే నతనిం బరిపరి విధంబుల 'నా తప్పు మన్నింపు' మని వేఁడితి. 'శ్రీరాముఁడు వచ్చి యివ్వనంబున ని న్నెన్నఁడు దహనంబు సేయునో నాఁడ నీకుఁ దొల్లింటి గంధర్వరూపంబు రాఁగల' దని యనుగ్రహించె. రాక్షసత్వంబున నే నింద్రునితోఁ బోరాడితి. అతండు ప్రయోగించిన బాణంబువలన నా తల యుదరంబులోనికిం దూఱిపోయెను. అప్పుడు నేను మహేంద్రుం బ్రార్థింప నతండు దీర్ఘబాహువుల నిచ్చె. నే నప్పటి నుండియు నిట్లే యున్నవాఁడ. నేఁటికి మీ యనుగ్రహంబువలన శాపవిముక్తి గాంచి ధన్యుండ నైతిని. మీరు బలశాలి యగు సుగ్రీవుని దగ్గఱి కేఁగిన నతండు మీకు సహాయుం

డగు" నని చెప్పి యా గంధర్వుండు స్వర్గంబునకుం బోయెను. రామలక్ష్మణులు నట్లే సుగ్రీవునికడకుం బోవుచుండ వారికి వృద్ధతపస్విని యగు శబరి కాన్పించె. ఆమె శ్రీరామచంద్రు నిమిత్త మెదురుచూచుచుండె. అతనికొఱకు సేకరించి యుంచిన వివిధఫలంబుల నతని కొసంగి యతని నాదరించి యతనివలన సదుపదేశంబుం బడసి కాష్ఠంబులం జితిం జేర్చుకొని శబరి దివంబున కరిగె.

శ్రీ ర స్తు.

సీ తా రా మ ము

నాలవ ప్రకరణము

పంపానదిం దాఁటి ఋశ్యమూకముం జేరి, యా పర్వత ప్రాంతంబున వానరరా జగు సుగ్రీవుండు తన యనుచరులం గూడి సరససల్లాపంబు లాడుచుండ రామలక్ష్మణులు వారిం జూచిరి. సుగ్రీవుండు రామలక్ష్మణులం గాంచి, రాజ్యభ్రష్టునిఁ జేసియుం దనియక వాలి తన్నుఁ జంపం బ్రయత్నించుచున్నాఁ డేమో యని యనుమానించి భయంపడెను. వారిలో హనుమంతుం డను వీరపురుషుండు గలండు. "సుగ్రీవా! వారు ఋశ్యమూకంబునకై వచ్చినవారు కారు. అట్టి లక్షణంబు లెవ్వియు వారి యిరువురియందుం గాన్పింప" వని యతండు ధైర్యంబు చెప్పె. అంతట సుగ్రీవుండు "హనుమంతా! వా రిరువురును వాలి సంబంధులవలెనే యున్నారు. వా రెవ్వరో విచారించి రమ్మని యతని నంపె. హనుమంతుండు వేద బ్రహ్మచారి వేషంబు వైచికొని శ్రీరాముని చెంతకుం జని మధురవాక్యంబులతో "మహాశయులారా! మీ రెచ్చటినుండి యెచ్చటి కేఁగుచు నిచ్చటికి విచ్చేసితిరి? మీరు సామాన్యులవలెం గాన్పింపరు. కందర్పసుందరాకారులును గమలాప్తతేజులు నైన మీ రేతెంచిన కారణం బేమో యెఱింగింపుఁడు. సుగ్రీవుండు తన యన్న యగు

వాలిచే రాజ్యభ్రష్టుండై యీ ఋష్యమూక పర్వతంబున నివసించుచున్నాఁడు. సుగ్రీవుండు చాల ధర్మాత్ముండును, సాహసవంతుండును. అతండు మీ మైత్రికై కుతూహల పడుచున్నవాఁడు. అందులకే నన్ను మీ కడ కతం డంపె. నే నతని మంత్రిని; హనుమంతుఁ డనువాఁడ" నని విన్న వించె. అతని వాక్యంబు లాలించి శ్రీరాముఁడు తమ్మునిం గనుంగొని "మనము సుగ్రీవునికొఱకే వెదకుచున్నారము. ఇంతలో నతని మంత్రియే వచ్చెను. ఇతండు చూడఁ గడుం గడు బుద్ధిమంతుఁడుగను విద్యావంతుండుగను గాన్పించు చున్నాఁడు. లక్ష్మణా! నీ వితనితో నత్యంతనిపుణంబుగా మాటలాడి సమాచారం బంతయుం గనుంగొను" మని యానతిచ్చె. లక్ష్మణుండు హనుమంతుని వంకకుం దిరిగి "హనుమంతా! మేము దశరథ తనయులము; రామ లక్ష్మణు లనువారము. అమ్మహారాజు ప్రియభార్య కైకవలన మేము రాజ్యభ్రష్టుల మై యడవులం జొచ్చితిమి. అనేక రాక్షసులం జంపితిమి. సీతాదేవిని మాయాకురంగంబై వంచించిన మారీచుని పీఁచ మణఁచితిమి. ఇవుడు సీతం గోల్పోయి యామె నివ్వనంబున వెదక నేతెంచితిమి. ఆమె యెచ్చట నున్నదో యెఱుంగుదువేని దయచేసి చెప్పుము. శ్రీరాముఁడు సుగ్రీవునితోడి మైత్రి నభిలషించుచున్నాఁ" డని యతనిం బ్రోత్సాహపఱచెను. "మీ రాయనతో స్నేహంబు సేసిన సీతను వెదకు సందర్భంబున మీ కతండు సహకారి కాఁ గలండు. అతండె యిందుల కెంతయు సమర్థుండు; ఇవుడు వాలి భయమ్మువలన నివురు గవిసిన నిప్పువలె నున్నవాఁడు.

మీావలన నతనికిం గూడ నుపకృతి కలుగనచ్చు" నని ప్రత్యుత్తరం బిచ్చి, యాంజనేయుండు రామలక్ష్మణులం దన భుజంబుల నిడుకొని వాయువేగంబున సుగ్రీవుని కడకుం జనియె. సుగ్రీవుండు శ్రీరామునకుం గృతపరిచయుండై "మహానుభావా! నీవీ జగంబం దందఱికన్న శ్రేష్ఠుండవు, నేను సామాన్య వానరుండను; నీవు నాతో స్నేహం బొనరింప నిచ్ఛగించుచున్నందులకు నా కపరిమితానందంబు పొడముచున్నది. నేనెంతటి యదృష్టవంతుండ!" నని తన మనోగతంబు వ్యక్తీకరించె. అంతట వాయునందనుం డగ్నిం బ్రజ్వలింపఁ జేయు, సుగ్రీవుం డగ్నిసాక్షికంబుగ రామునిం గని "నీవు నా ప్రాణమిత్రుండ వైతివి. నీ సుఖమే నా సుఖము; నీ దుఃఖమే నా దుఃఖము; నీ యిష్టమే నా యిష్ట" మని ప్రమాణంబు సేసి "మింటిదారిం ద న్నెవండో కొనిపోవుచుండ, నొక రమణీమణి యేడ్చుచు నొక భూషణంబుల మూట నిటం బడ మీాఁటె. ఇదియే యా మూట. దీనిం జూడు" మని దాని నతని కందిచ్చె. శ్రీరాముఁ డా యాభరణంబులం గాంచి "హా! ప్రియా!" యని యేడ్వం దొడంగెను. "జగ మంతయుం గాలించి జానకిం దెత్తును; నీవు వగవకుము; సీతాదేవి యెచ్చట నున్నం దెచ్చి నీ కిచ్చెడి భారంబు నాయది" యని సుగ్రీవుండు రామున కుత్సాహంబు కలిగించె. అంతట శ్రీరాముఁడు "వాలిని వధించి నీచేఁ గపిరాజ్యం బేలింతు" నని శపథంబు సేసి సుగ్రీవు నోదార్చె. అనంతరము సుగ్రీవుండు శ్రీరాముని పాదంబులకు మ్రొక్కి తన యుదంతం బిట్లు వచింపఁ జొచ్చె; "అయ్యా! మాయావి యను నొక ఘోరరాక్షసుం డొకప్పుడు వాలితో యుద్ధంబు

చేసెను; వాఁడు దుందుభికి సోదరపుత్త్రుండు. తుదకు వాఁడు వాలితోఁ బోరాడలేక యొక పర్వతగుహం జొచ్చెను; వానిని వెంబడించిన వాలియు నా బిలంబుం బ్రవేశించి న న్నా గుహాముఖంబున నుండ నియమించెను. అచ్చట నే నొక సంవత్సరంబువఱకు వేచియుంటిని. వాలి గుహాముఖంబునకు మరలి రాకుండుటచేతను గుహానుండి యుష్ణరక్తంబు బహిర్గతం బగుటవలనను రాక్షసుల భీషణారావంబులు వినం బడుటవలనను వాలి మృతి నొందె నని నిశ్చయించుకొని బిల ముఖంబున నొక శిల నడ్డువైచి సోదరుం గూర్చి దుఃఖించుచుఁ గిష్కింధకుం బోయితి. పురవాసు లందఱు వాలి మరణవార్త నాలించి నన్నుం బట్టభద్రు నొనర్చిరి. కొంత కాలంబునకు వాలి మరలివచ్చి "నే నీ సుగ్రీవుని గుహాముఖంబున నుంచి రాత్రించరసంహారంబునకై గుహం జొచ్చితి. మరల వచ్చునంతలో నీ దుష్టుండు గుహాద్వారంబును శిలచేఁ గప్పి నారాజ్యం బాక్రమించుకొని యేలుచున్నాఁ" డని పౌరులకుం జెప్పి నన్నుఁ బలుబాములం బెట్టి వెడలఁగొట్టెను. నే నెన్ని విధంబుల సత్యముం జెప్పినను నా వాక్యంబు లతఁ డాలింపఁడాయె. అప్పటినుండియు నేను వాలి భయంబున నీ ఋశ్యమూక పర్వతంబున వసించుచున్నాఁడ. మతంగ మహాముని శాపంబున వాలి ఋశ్యమూక పర్వతంబునకు రాఁజాలఁడు. కావున, నే నిక్కడ నిర్భయంబుగా నుండఁ గల్గితి" నని సుగ్రీవుండు తన కష్టకారణముం జెప్పి శ్రీరాముఁడు వాలిని సంహరించెద ననినందులకుఁ జాల సంతోషించెను గాని 'దుందుభిసంహారుం డగు వాలిని శ్రీరాముఁడు

చంపఁగలఁడో లేఁడో?' యని సందేహింపఁజొచ్చెను.

దుందుభి భీకరమహిషాకారుఁడు. ఆ రాక్షసుండు సముద్రునితో యుద్ధము సేయం బోయె. సముద్రుండు భీతిల్లి నమస్కారపూర్వకంబుగం దన యశక్తత నొప్పుకొని హిమవంతుని కడకుం బొమ్మనియె. హిమవంతుండును యుద్ధంబునకు సమ్మతింపక కిష్కింధాపురాధీశ్వరుం డగు వాలియొద్దకుం బొమ్మనియె. అంతట దుందుభి వాలియొద్దకు వచ్చి "నాతో యుద్ధంబు సేయు" మని కోరె. వాలి వానిం జంపి దిర్దిరం ద్రిప్పి నాలుగు క్రోశముల దూరంబునం బడవైచె. దుందుభి రక్తంబు మతంగము న్యాశ్రమంబునం బడుటంజేసి యమ్ముని యాగ్రహించి "వాలి యిచ్చటికి వచ్చిన, శిరస్సు బ్రద్దలయి చచ్చుఁగాక!" యని శపించెను. వాలి బలంబున కద్భుతపడి భయంపడుచుండెడి సుగ్రీవుం డచ్చటనే పడియున్న దుందుభి యెముకలు శ్రీరామునకుం జూపె. అతని సందేహము న్నివారింపఁ దలంచి "ఓసుగ్రీవా! శ్రీరాముఁ డేమి చేసిన నతండు వాలిం జంపఁగలం డని దృఢమ్ముగ విశ్వసించెద?" నని లక్ష్మణుండు ప్రశ్నించె. "దుందుభిశల్యపంజరంబును ద్విశతధనుర్దూరం బెగురవైచినను సప్తతాళంబుల ధనుస్సున భేదించినను నాకు నమ్మకంబు జనించు"నని యతఁడు ప్రత్యుత్తరం బిచ్చె. శ్రీరాముఁ డతండు కోరిన రీతి నతనికి విశ్వాసంబు కలిగించె. అంత, సుగ్రీవుండు 'వాలిని శ్రీరాముఁ డొక్క బాణంబుననె చంపఁగలం' డని గ్రహించి వాలి మందిరంబుకడ కేఁగి యాకసంబు బ్రద్దలగు నట్లు "అన్నా! ఎం దున్నాఁడవు? రా రమ్ము; కొంచెము

యుద్ధంబు సేయుద" మని యఱచెను. వాలి యా కంఠధ్వని వినినతోడనే రోషపరవశుండై సుగ్రీవునిపయిం బడి ఘోరంబుగఁ బోరొనర్చెను. తుదకు సుగ్రీవుం డోటువడి పర్వతంబునకుం బరువిడి వచ్చి "హా! మిత్రమా! ఇదియే నీ వొనర్చెడి సహాయంబు? నేను మృతప్రాయుండనై యుండ నీవు వినోదంబు చూచుచుంటివా?" యని రామునిం జెప్పెను. శ్రీరాముఁడు సుగ్రీవుం గాంచి "నెచ్చెలీ! ఆగ్రహింపకుము. నే నెందుచే బాణంబు విడువలేదో వినుము; మీ యిరువురి ఘూకృతులు నొక్క తెఱంగుననె యుండుటంబట్టి యెవండు వాలియో కనుంగొననేరనైతి. వాలిం జంపఁబోయి నిన్నుం జంపిన లోకులు నన్ను నిందింపరా? నీ వేదేని యొక చిహ్నంబు ధరించి యుద్ధమునకుం బొమ్ము. అపుడు వాలి నొక్క కోలం దూలింతు" నని నచ్చఁజెప్పి, లక్ష్మణునిం గాంచి "తమ్ముడా! ఏదే నొక పుష్పలతను సుగ్రీవుని కంఠమం దుంచు" మని యాజ్ఞాపించెను. లక్ష్మణుం డనువర్తించెను. అపుడు సుగ్రీవుం డెక్కుడు ధైర్యసాహసములతో మరల నరిగి వాలిని యుద్ధంబునకు రమ్మని భయంకరనినాదంబు గావించె. సుగ్రీవుని యుత్సాహంబు చూచి వాలి సత్వరంబుగ యుద్ధసన్నద్ధుం డయ్యె. ఇరువురును సమానధైర్యశౌర్యంబులతోఁ బోరాడిరి కాని వాలి యెక్కుడు బల ముండుట వలన సుగ్రీవుండు వెనుకంజ వేయవలసివచ్చెను. ఈ సమయంబున శ్రీరాముఁడు వాలి వక్షస్స్థలంబు వ్రయ్యునట్లు లోక బాణంబు వైచెను. బాణఘాతంబు వెంటనే వాలి నేలం గూలె. రామలక్ష్మణులు వానిం జూడఁ బోయిరి. "నీ వెట్టి

శూరుండవు! దొంగతనంబుగ నామీఁద బాణంబు వైచితివి. నా యెదుట నిలిచి పోరాడినం గదా నీ పౌరుషంబు బయల్పడెడిది? నన్నుఁ జంపుటచే నీ కేమి లాభంబు గలిగినది?" యని వాలి శ్రీరాముని నిందించెను. "నీవు దుష్టుండవు; కావున శిక్షార్హుండ" వని శ్రీరాముఁడు ప్రత్యుత్తరం బిచ్చె.

శత్రుసంహారంబు సంతోషకారణంబె యైనను, వాలి భార్య తారయుఁ గుమారుం డంగదుండు నాక్రందించునపుడు, రామలక్ష్మణుల మాట యటుండనిండు, సుగ్రీవుండు సైత మశ్రుధార లాఁపంజాలకపోయె. మృత్యువు ప్రాపింపక మున్న వాలి మంచి బుద్ధిం దెచ్చుకొని సుగ్రీవునిం బిలిచి "సోదరా! దుర్బుద్ధిచే నేను నీయెడ నన్యాయం బొనరించితి; నన్ను క్షమింపుము; అంగదుని నీకే యొప్పగించుచున్నాఁడ. నీ పుత్త్రుం బోలె వానిం జూచుకొ" మ్మని తన కంఠహారముం దీసి సుగ్రీవున కొసంగెను. వాలి మృతి నొందిన వెంటనే సుగ్రీవుని రాజుగను అంగదకుమారుని యువరాజుగను శ్రీరాముఁడు నిర్ణయించె. పిమ్మట సుగ్రీవుండు సుఖంబుగఁ గాలము గడపుచు సీతాన్వేషణవిషయమే విస్మరించెను. సుగ్రీవుండు సంసార సౌఖ్యంబులలో మునింగి తమ్ము మఱచియుండుట నెఱింగి శ్రీరాముఁ డతనిం గొని రమ్మని లక్ష్మణుం బంపె. ఇనజుండు లక్ష్మణుని సకలవిధంబుల సత్కరించి యనుచర సమేతంబుగా శ్రీరామునికడ కేతెంచె. పృథ్వి యీనినట్లు వివిధప్రదేశముల నుండి వానరులు కిష్కింధాపురంబునకు వచ్చిరి. గణనాతీతం బగు వానరబలంబునకుం దావు చాలదయ్యె. విశాలం బగు కిష్కింధాపట్టణంబు చిన్నదిగం గాన్పించె. సుగ్రీవుఁ డా

వానరుల న్నలుదిక్కులకు భూసుతాన్వేషణార్థం బంపెను. వా రందఱిలో వాయుసుతుం డగు నాంజనేయుండు కడుం గడు బలవంతుండు. సుగ్రీవుం డతనిం బిలిచి "హనుమంతా! జలస్థలగగనస్వర్గంబులందు నీవు దక్క మఱియెవ్వరుం దిరుగఁ జాలరు. కావున సీతాన్వేషణంబు మిక్కిలి జాగరూకతతో నీవ గావింపవలయు. నీవంటి వీరపురుషుండు గానరాఁడు. తప్పక నీ వీ కార్యంబు సాధింపఁ బూనుకొ" మ్మని హెచ్చరించెను. ఆంజనేయుండు జనకజం జక్కఁగ వెదకి తేఁగలం డని గ్రహించి శ్రీరాముఁ డతనికిం దన యుంగరం బిచ్చి యది సీత కానవాలుగఁ జూపు మని యానతిచ్చె. సీత నెటులైనం దోడ్కొనివచ్చుట కత్యుత్సాహంబుతో బైలుదేఱి నానా దేశంబులుం దిరిగి యెంత శ్రమపడి వెతకినను ధరణిజ యన్వేషకుల కెవరికిం గాన్పింపదయ్యె. ఇట్లు వారు మాస పర్యంతముఁం బర్యటనంబు సేసి మగిడి కిష్కింధాపురంబు చేరిరి. హనుమంతుండు అంగదుఁడు జాంబవంతుఁడు మున్నగు వానరులు దక్షిణదిక్కునకుం బోయిరి. వారు మాత్ర మింకను మరలిరా లేదు. వారుం దిరిగి తిరిగి వేసరిరి కాని, శ్రీరాముని యెడ నాంజనేయున కెక్కుడు భక్తి యుండుటవలన నతండు వారిం బ్రోత్సాహపఱచి మరల సీతాన్వేషణంబునకుం బురికొల్పెను.

కపిసేన సంచారము చేసిన ప్రదేశం బంతయు భస్మీభూతం బయ్యెను. వృక్షములు జన్మించుటకేని వీలు లేకుం డెను. సరోవరంబు లన్నియు నెండిపోయెను. ఘోరారణ్యము నిశ్శబ్ద మయ్యెను. వా రప్డుడు సంచరించుచున్న స్థలము

మిక్కిలి భయంకరము. పూర్వ మయ్యెడఁ గండునామంబు గల యొక ముని యుండెడివాఁడు. తనపుత్త్రుం డా ప్రదేశమున మృతి నొందుటచే నమ్ముని దుఃఖంబున మునింగి యా వనంబును దగ్ధంబుగా శపించె. అచ్చటం గూడ సీత కాన్పింపక పోయె. వా రంతట మఱియొక వనంబు ప్రవేశించిరి. అచ్చట వికృతాకారుం డగు నొక రాక్షసుండు వారిం జంపుటకుఁ దఱుముకొని వచ్చెం గాని యంగదుండు వానిని నేలం గూలఁజేసె. హనుమదాదులు భూతనయ నన్వేషించుచుం దిరిగి తిరిగి యొక గుహాముఖంబున కేతెంచిరి. గుహానుండి హంససారసాది పక్షిగణంబు జలకణాలంకృతం బై వచ్చుచుండుటం బట్టి తదంతరంబున జలాశయం బుండు నని తలంచి యం దందఱుం బ్రవేశించిరి.

వా రటు పోవం బోవఁ గొంత దూరం బంధకారబంధురంబుగ నుండె. ఆ చీఁకటిం దాఁటిన వెన్క దివ్యజ్యోతి కాన్పించె. అక్కడి వృక్షంబులు సరస్సులు మత్స్యంబులు సర్వంబు స్వర్ణమయంబై యుండె. అయ్యెడ నొక తపస్విని నిజప్రభావంబు వలన దేహమునుండి యగ్నిజ్వాలలు ప్రజ్వలించుచున్నట్లు ప్రకాశించుచుండె. ఆమె విశ్వకర్మ పుత్త్రిక యగు హేమ. కపివీరు లందఱు నామె కతిభక్తితో నమస్కరించి "అమ్మా! మే మన్న పానంబులు లేక కృశించియున్న వారము. ఈ యద్భుతవనం బెవ్వరిదో, ఈ వస్తువు లన్నియు నెట్లు హేమమయంబు లయ్యెనో కరుణించి యెఱింగింపు" మని ప్రార్థించిరి.

తపస్విని వారిం జూచి "వత్సలారా! ఇది మయరాక్షస వినిర్మితంబు. మీ రీ భయంకరస్థలంబున కెందుల కేతెంచితిరి?" రని వారికి నానావిధ ఫలంబుల శీతలోదకంబుల నొసంగె. వానరవీరులు వాని నానందంబునం బరిగ్రహించి యామె కనేక వందనంబు లర్పించి యా బిలంబునం దొక మాసంబు గడపిరి. తరువాత వారు బయల్పడ మార్గంబు గానక మహా విపత్తునం బడియుండ "వత్సలారా! ఈ గుహాయం దొకసారి ప్రవేశించిన వారు మరల వెడలుటకు వీలు లేదు. ఐనను మీరు భయపడకుఁడు. క్షణమాత్ర నేత్రంబులు ముకుళించు కొందురేని మిమ్ము బయటికిం దీసికొని పోయెదు" నని హేమ వారి సంకటముం దీర్చె. వారు నేత్రంబులు మూసికొని తెఱచునంతనే వింధ్యపర్వతప్రాంతంబున నుండిరి. సమీపం బున సముద్రుండు తరంగముఖంబున గర్జించుచుండె. బయటికి వచ్చిరే కాని వారి కించుకయు నానందంబు లేదు. సీతం గనుంగొని పోకున్న సుగ్రీవుండు తమ్ముఁ జంపు నని వారు భయంపడఁజొచ్చిరి.

వారు రిక్తహస్తంబులతో స్వదేశంబునకు మరలుట కన్న నన్నపానంబులు విసర్జించి యచ్చటం జచ్చుటయే మంచి దని నిశ్చయించుకొని విచారగ్రస్తులై శ్రీరామ చంద్రుని సీతాదేవిని దశరథుని జటాయువును బేర్కొనుచు నేమేమో ప్రస్తావించుకొనుచుండిరి. వింధ్యపర్వత శిఖరంబునం గూర్చున్న ఖగేంద్రుం డొకండు వనచరులం జూచి 'చాల దినంబులకు నాకు మంచి యాహారంబు లభించినది. ఏమి నా భాగ్యంబు! ఒక్కొక దానిం జంపి తినెద' ననుకొని

యువ్విళ్లూరం జొచ్చెను. ఆ మాటలు విని యంగదుండు హనుమంతునిం జూచి "యముండు మనలం దీసికొనిపోవుటకుఁ బక్షిరూపంబున వచ్చె. మనప్రాణంబులు పోయినను మనము సీతను గనుంగొనకుండఁ బోరాదు. జటాయువు సీతాదేవికొఱకు యుద్ధముం జేసి ప్రాణ మర్పింపలేదా?" యని హెచ్చరించెను. జటాయువు పేరు వినినంతనే యా ఖగేంద్రుం డాతురతం జెంది "మీర లెవరు? నా సహోదరుం డగు జటాయువు మృత్యువు వాతం బడినట్లు నుడువుచున్నారు. వాఁ డెట్లు చనిపోయినాఁడు? నేను సంపాతిని. నా ఱెక్కలు కాలిపోయినవి. నే నెగురంజాలను. నన్ను మీ కడకుం దీసికొనిపొం" డని వారిం బ్రార్థించె. వానరులు సంపాతిని దింపుటకు భయంపడిరి కాని, తా మెటులైన నంజచ్చుటకే నిశ్చయించుకొనియున్న వా రగుటచే నంగదుండు సాహసించి సంపాతిని దించి తీసికొనిపోయి శ్రీరాముని వనవాసము రావణుండు సీత నెత్తుకొనిపోవుట జటాయువు యుద్ధంబు సేసి మడియుట శ్రీరాముఁడు వాలిం జంపుట మున్నగు విషయంబుల నన్నింటిని దెలియఁబఱచె. సంపాతి యశ్రుకణంబులు రాల్చుచు "నాదు సహోదరుం డగు జటాయువుం జంపిన రావణునకుఁ బ్రతికృతి ఘటింపఁజాల. బాల్యంబున నేనును నా సహోదరుండును మహేంద్రుని జయించుటకై పోతిమి. యుద్ధమునుండి తిరిగి వచ్చు సమయంబున జటాయువు సూర్యతాపంబున కాఁగలేక సొమ్మసిల్లె. అంత నతని సంరక్షింప నా ఱెక్కలం బొదివి పట్టుటచే నా పక్షంబులు కాలి నే నీ తావునం గూలితి. అప్పటి

నుండి యిచ్చటనే యున్నాఁడ. ఒక దినంబున రావణుం డొక యబల నెత్తుకొనిపోవుచుండ నేనుం జూచితి. ఆమె "హా రామా! హా లక్ష్మణా!" యని రోదనం బొనర్చుచుండె. శత యోజనంబుల వెడల్పు గల యీసముద్రముం దాఁటిన లంక కాన్పించును. అదియే దశకంఠుని నివాసస్థలంబు. మీ రాల స్యంబు సేయక శీఘ్రంబ లంక కేఁగుఁడు. సీతాదేవిని రావణుం డెత్తుకొనిపోవు ననుసమాచారంబును నిశాకరముని నాకిది వఱకే తెలిపియున్నాఁడు. ఎనిమిదివేల యేండ్లక్రిందట నతం డిచ్చోనుండెడివాఁడు. నేను బ్రతిదినంబు నతనికిం బ్రణా మంబు సేయుటకుఁ బోవుచుండెడివాఁడ. అతండు నాయం దత్యంతప్రేమంబును జూపువాఁడు; నా ఱెక్కలు సూర్యకిర ణంబుల వేఁడిమివలన భస్మం బయినపుడు "శ్రీరాముని దేవి యగు జానకిని రావణుం డెత్తుకొని పోయినట్లు నీకుం దెలిసి నప్పుడు మరల నీకుం జక్కని ఱెక్కలు వచ్చు" నని యతండు నాకు వరం బొసంగి యున్నాఁ" డని చెప్పుచుండఁగనే సంపాతికి సొంపుగఁ బక్షంబు లుత్పన్నంబు లయ్యె.

అంతట 'నీ గంభీరం బగు సముద్రంబుం దాఁటి సీతా దేవి వృత్తాంతముం దెలిసికొనిరాఁ గలవా రెవ్వ? ' రను విషయంబు ప్రస్తావనకు రా, వానరు లందఱు "నేన చేయ నోపుదు. నేన చేయనోపుదు" నని పంతంబు లాడసాగిరి; తుదకు హనుమంతుండే యీ ఘనకార్యంబులు సాధింపఁగల వాఁ డని నిశ్చయించిరి.

హనుమంతుండు పవనపుత్త్రుండు; ఇంద్రుండు హను మంతునిపై వజ్రముం బ్రయోగింపఁ బ్రభంజనుం డాగ్రహ

పరవశుండై సకలవాయువులను బంధించె. అందువలన జను లందఱు నుచ్ఛ్వాసనిశ్వాసంబు లాడక మృతప్రాయు లైరి. దేవత లందఱు నతనిం బ్రతిమాలి "హనుమంతుండు తన కిష్టంబు లేకుండ మృతుండు కానేరఁ డనియు నే బాణంబు వలనం జావం." డనియు వరం బొసంగిరి.

అనంతరము హనుమదాదులు మహేంద్రపర్వతంబు నకుం బోయిరి. అక్కడ నున్న మృగంబు లన్నియు వారి రాకకు భయం బంది గుహాలం బ్రవేశించె. పక్షిగణంబు లెగుర నారంభించెను.

శ్రీరస్తు.

సీతారామము

ఐదవ ప్రకరణము

మహేంద్రపర్వతముపై నొక సమస్థలంబున నిలువంబడి హనుమంతుండు దేవతారాధనం బొనరించి కరద్వయంబు మీఁది కెత్తి యెగురుటకు సంసిద్ధుఁడై యుండెను. అపు డమ్మారుతి శరీరంబు భీషణాకృతిం దాల్చినందున మహేంద్రపర్వతంబు దాని భరింపంజాలదయ్యె. ఆ పర్వతంబునుండి జలంబు బహిర్గతం బయ్యె. అక్కడి మృగకులంబు ప్రళయం బాసన్న మయ్యె ననుకొనియె. మునులందఱు పర్వతంబు విడిచి దూరముగం జని చిత్రముం గనఁజొచ్చిరి,

పవనసుతుం డా పర్వతమునుండి యెగురఁగనే వృక్షంబు లన్నియు నతని వెనువెంటనే యెగురం దొడంగె. సముద్రజలం బాకాశంబు నంటె. దేవత లందఱు నాశ్చర్యపడం దొడంగిరి. అతని వాయుగమనం బాకాశమధ్యమునుండి పర్వతంబు పరుగెత్తుచున్నదో యనునట్లుండెను.

మైనాకపర్వతంబు జలంబులనుండి పైకిఁ దలచూపి హనుమంతున కాహ్లాదదాయకంబుగఁ బ్రవర్తిల్లె. తన కించుకయు నలసట లేకుండుటవలనను వ్యవధి చాలనందునను, మైనాకపర్వతంబు తనపై విశ్రాంతిం జెందు మని యభ్యర్థించి

యు, అతం డచ్చట నాఁగక యే సత్వరంబుగ నేఁగవలసివచ్చెను. అంతట మైనాకుం "డో యాంజనేయా! సత్యయుగంబునఁ బర్వతంబుల కన్నింటికి ఱెక్క లుండెడివి. అవి తమ కిచ్చ వచ్చిన స్థలంబుల నెల్లం దిరుగుచుండెడివి. వాని భారంబు వలన ననేకమృగంబులు మృతి నొందుచుండెడివి. అందు వలనం గుపితుం డై యింద్రుండు వజ్రాయుధమునం బర్వత పక్షంబులం దెగ నఱుక మొదలువెట్టె. ఆ సమయంబున నీ తండ్రి వాయుదేవుని దయవలన నీ సముద్రంబునం బడి బ్రదికితి. నీ తండ్రి నా కంత సహాయంబు చేసినందునకు, నీవు నా శిఖరంబునం గూర్చుండి కొంచె మలసటం దీర్చికొని రుచ్యంబు లగు ఫలంబుల భుజింతువేని, నేనుం బ్రత్యుపకారం బించుక చేసినవాఁడ నగుదు" నని విన్నవించె.

అపు డాంజనేయుండు "పర్వతోత్తమా! సాదరంబు లగు నీ పలుకులవలన మితి మీఱిన యానందముం బొందితిని. నాకుం జాల పని యున్నది; నన్ను క్షమింపు" మని మైనాకుని స్పృశించి "నేను విశ్రమించితి ననియే యెంచుకొ" మ్మని వెడలిపోయెను. హనుమంతుని సామర్థ్యదీక్షలం గనుంగొనవలె నను కుతూహలంబున దేవతలు నాగమాత యగు సురసం బిల్చి యతనికిం బథమధ్యంబున విఘ్నంబులు ఘటింపు మని చెప్పిరి. వారి యాజ్ఞ ప్రకారము సురస భీషణాకారంబు దాల్చి హనుమంతునియెదుట నిలువంబడ, నతం డా రక్కసిం జూచి తన దేహముం బెంప నారంభించెను. అంతకన్న నెక్కుడుగ నా రక్కసియుం దన నోరు బెడలు పొడిగింపం దొడంగెను. ఉపాయాంతరంబు గానక

యాంజనేయుం డంగుష్ఠమాత్రుం డై రాక్షసి వక్త్రంబుం జొచ్చి బహిర్గతుం డయ్యె. అట్లతండు సురసను మోసపుచ్చి పోవుచుండ నింకొక రక్కసి యతనిం నెదుర్కొనియె. దాని పేరు సింహిక. హనుమంతుండు దానిం గూడ భంగపఱచి దాని యుదరంబునం బ్రవేశించి ప్రేవు లెల్ల భేదించి వెడలి పోయెను.

లంకాపట్టణంబు సమీపించుటవలన హనుమంతున కదంతయు దృష్టిపథంబునం గట్టిన ట్లుండెను. ఆ పురంబు విజయపతాకలతోడను స్వర్ణసౌధంబులతోడను శృంగార వనంబులతోడను గనకప్రాకారంబులతోడను దేదీప్యమానంబుగఁ బ్రకాశించుచుండె. లంబపర్వతంబుపై విశ్వకర్మ స్వయంబుగా నా పురంబును బంగారంబుతోఁ గట్టె. అది స్వర్గంబువలె శోభిల్లుచుండె. శస్త్రాస్త్రపాణు లగు భటులు దాని గాచుచుండిరి. హనుమంతుండు ధైర్యసాహసంబులతో నుత్తరద్వారంబు చేరెం గాని పట్టపగంట నగరు సొచ్చిన రాక్షసులు కనిపట్టెద రని యెంచి యణుమాత్ర దేహుండై నిశాసమయంబునం బురంబు ప్రవేశించె. అప్పుడు భీషణాకారంబు గల యొక రాక్షసి యతని నెదిరించి "నీ వెవండవు? ఎక్కడనుండి వచ్చితివి? సత్యముం బల్కుము. పలుక వేని, నిన్నుం జంపెద" నని బెదరించె. "ముందు నీ వెవ్వతెవో ఎందుల కిట్లు కోపంబు చేయుచున్నదానవో చెప్పు" మని హనుమంతుండు మరల ప్రశ్నించెను. "నే నీ లంక కధిదేవతను; లంకిణి యనుదాన. రాక్షసులు నన్నుం బూజింతురు. నేను లంకం గాపాడుచుందు. నీ వీ దినంబు నాచేతం జత్తు"

వని యా రక్కసి ప్రత్యుత్తరం బిచ్చె. అంత నాంజనేయుండు "పట్టణముం జూడవచ్చితి" నని నిర్భయంబుగఁ జెప్పెను. అది "న న్నోడింపకున్నం బురంబుఁ బ్రవేశింపంజాల" వన, "నేను నిరాతంకంబుగఁ బ్రవేశింతుం జూడు" మని హనుమంతుండు దాని నదలించె. అంతట రక్కసి యాగ్రహించి యాంజనేయునిం దన యఱచేతం జఱచెను. పవననందనుండు క్రుద్ధుండై దానిం గ్రిందఁ బడునట్లు పిడికిటం బొడిచె. అటు పొడువఁగనే యది మూర్ఛిల్లి కొంత తడవునకుం దెలివి తెచ్చుకొని "తండ్రీ రక్షింపుము; వానరునిచే నే నెప్పు డపజయంబుఁ గాంతునో యప్పుడే లంకకుం జేటు వాటిల్లు నని శాపంబు కలదు. ఆ సమయం బిప్పు డాసన్నం బయ్యె; నీవు పురంబుం బ్రవేశించి నీ యిచ్చ వచ్చినట్లు సేయు" మనియెను. వాయుసూతి నగరంబుం బ్రవేశించి కొంచెమైన శంక లేక వారణవాజిశాలలు దేవాలయంబులు మున్నగు నెల్ల ప్రదేశంబుల సీతాదేవి నన్వేషించె. కాని, సీత యెందుం గాన్పింపదయ్యె. విశ్వకర్మ బ్రహ్మకొఱకు నిర్మించిన నవరత్నస్థగితం బగు పుష్పకం బతని దృష్టిపథంబునం బడియె. ఆ రథంబును బ్రహ్మ కుబేరున కిచ్చె; రావణుండు దానిం గుబేరునినుండి బలాత్కారంబునం గైకొనియె. హనుమంతుం డా రథం బెక్కి రావణుని స్వర్ణసౌధం బంతయుఁ బరిశోధించెను. రావణుని గృహంబునం దందఱు శయనించి యుండిరి. దైత్యనాథుని సౌధంబు స్వర్ణమయ వాతాయనంబులును మణిమయసోపానంబులును దంతనిర్మిత పాంచాలికలును స్ఫటికస్తంభంబులును గలిగి మిగులఁ బ్రకా

శించుచుండె. దశకంఠుని పాన్పు స్ఫటికవేదిపై విలక్షణంబుగ వెలయుచుండె. మణిమయప్రతిమలు వింజామరంబులు వీచు విధంబునం గనుపట్టె. హనుమంతుండు రాణి యగు మండోదరిం గాంచి సీతాదేవి యని మొదట భ్రమించెం గాని, సీత యంత నిశ్చింతంబుగ నెన్నండు నుండ దని తలంచి యా స్థలంబును విడిచి కొండొక తావునకుం జనియె. రావణుని భోజనాగారంబున నాహారంబు భుజించుచుం గొందఱు నిద్రాపరవశులై యుండిరి. పసిఁడి కంచంబులు నానావిధమృష్టాన్నంబులతోడ నిండియుండె. అయ్యెడ దేవకన్యలు నాగకన్యలు మొదలగు సుందరు లుండిరి. వికటస్వరూప లగు రాక్షసస్త్రీలుం గలరు. అం దెందును సీత మాత్రము గోచరింపదయ్యె. భూజాత నెందుం గానక "యామె ప్రాణంబులు విడిచెనో! లేక రావణుం డామెను మ్రింగెనో?" యని పరిపరివిధంబులం బరితపించి హనుమంతుండు తాను గూడ మృతి నొందుటకే నిశ్చయించుకొనెం గాని యింకను నెల్ల తావులుం బరిశీలింప వలయు నను దృఢసంకల్పంబుతో నశోకవనంబుం బ్రవేశించె. అవ్వనంబునం దప్పక సీత కాన్పించు నని తన యంతరాత్మకు స్ఫురింప, నతం డయ్యెడం గలయ వెదకుచు నొక వృక్షంబు క్రింద నొక యబల గూర్చుండి యుండుటం గాంచె. ఆమె నిరుపమానసౌందర్యవతి యైనను గడు విచారంబున మలిన వస్త్రధారిణి యై శుష్కించియుండెను. పలువురు రాక్షసస్త్రీ లామెం బరివేష్టించి నానావిధకఠినోక్తులం బలుకుచుండిరి. అనవరతం బాయింతి బాష్పవారిం గురియుచుండె. హనుమంతుం డామెం గాంచి సీతగా నిశ్చయించి రాక్షసు లామె

యొద్ద నుండుటవలనం బ్రభాతంబునకై నిరీక్షించుచుండె; అచటి రాక్షసస్త్రీలలోఁ గొందఱు దీర్ఘకాయంబులు గల వారుగను గొందఱు గూని వీఁపులు గలవారుగను మఱి కొందఱు గ్రుడ్డివారుగను నుండిరి. కొందఱి కర్ణంబులు గజ కర్ణంబులవలెను గొందఱి శ్రోత్రంబు లశ్వశ్రోత్రంబులవలెను నుండె. కొందఱి కాయంబులు కంబళంబులవలె నుండెను. కొందఱి ముఖంబులు వ్యాఘ్రముఖంబులవలెను గొందఱి యాస్యంబులు శునకాస్యంబులవలెను మఱికొందఱి వదనం బులు వరాహవదనంబులవలెను నానావిధంబులుగ నుండె. కొందఱికి గజదంతంబులం బోలు దంతంబులు గలవు. ఇట్టి వీరందఱు నాయుధహస్తలై నలువైపుల నిలువంబడి సీతా దేవికిం గావలి గాచుచుండిరి. నడుమ రేయి రావణుం డరుదెంచి మధురవాక్యంబులతో సీతను సంతుష్టురాలిం జేయఁ బ్రయ త్నించెం గాని వాని ప్రయత్నంబు విఫలం బయ్యె. వాని పలుకు లామె యాలింపక "ఓరీ! దుష్టాత్మా! రావణా! ఎల్లప్పు డన్యాయం బొనరించుటయే నీ పనియా? శ్రీరామ లక్ష్మణులు వచ్చి నీకుం దగిన శాస్తి యొనర్తురు. నీవు నీ మంచి కోరెదవేని నన్ను విడిచిపుచ్చి శ్రీరాముని శరణుఁ జొచ్చి యతని సంతోషపఱుపుము. అటు చేయవేని నీవే కాక నీ ప్రజ లందఱు నశింతు"రని నొక్కి వక్కా ణించెను. ఆ మాటలు విని రావణుండు మండిపడి కట తటంబు లదుర, "సీతా! ఇఁక నీకు మాసద్వయంబు వ్యవధి యిచ్చుచున్నాఁడ; అప్పటికైన నీవు నా చెప్పిన చొప్పున నొప్పుకొనవేని నిన్నుం జంపి తినెద"నని బెదరించె.

సీతాదేవి "నేనే పూనుకొన్నచో నిన్నిప్పుడే భస్మీపటలంబు సేసియుందుఁగాని శ్రీరాముని యనుమతి లేనందున మిన్నకుంటి" యని ప్రత్యుత్తరం బిచ్చెను. ఆ పలుకు లాలించి పఙ్క్తికంఠుండు ప్రయోజనంబు లేదని తెలిసికొని యసురస్త్రీలను 'బోధించుచుండుఁ' డని యాజ్ఞాపించి వెడలిపోయెను. రావణుండు చనిన యనంతరంబు రాక్షసస్త్రీ లందఱు సీతాదేవిని దమ యిచ్చ వచ్చినట్లు మునుపటికంటె హెచ్చుగం దుచ్ఛవాక్యంబుల దూషింపఁజొచ్చిరి. అంతట విభీషణుకూఁతురు త్రిజట యను రక్కసి యేతెంచి "మీరు సీతాదేవిం గష్టపెట్టకుఁడు; నేను దుస్స్వప్నముం గంటి; రావణుండు చచ్చునో, లంక యే నాశం బగునో? మీరు సీతం దిట్టుచున్నందుల కామె యడుగులం బడి క్షమాపణ వేఁడుకొనుం"డని మందలించె. అంత, రాక్షసస్త్రీలు "మా యపరాధంబు మన్నింపు" మని సీతం బ్రార్థించిరి. "త్రిజట చెప్పినట్ల యగునేని మిమ్ముం గాపాడెద" నని సీత వారి నూరార్చి మరల నేడ్వం దొడంగె. అశోకవృక్షంబు కడకుం జని యామె తన శిరోజంబులతోఁ గంఠంబున కురి వైచుకొని ప్రాణంబులు విడుచుటకుం బ్రయత్నింపఁజొచ్చె. ఆ సమయంబున నామెం గావలి గాచుచున్న రాక్షసస్త్రీ లందఱు నిద్రించుచుండిరి. బలాత్కారంబునం బ్రాణంబులు విడువనున్న సీతం జూచి మరున్నందనుం డామె యురిపెట్టుకొనుచున్న శాఖమీఁదుగ నామెను సమీపించి "దశరథమహారాజు తనయుం డగు శ్రీరాముం డనుజుం డగు లక్ష్మణునితోడను ధర్మపత్ని యగు సీతతోడను బినతల్లి యాదేశంబున వనంబునకు వచ్చె. క్రూరాత్ముం డగు రావ

ణుండు శ్రీరాముని మోసపుచ్చి సీతాదేవి నెత్తుకొనివచ్చెను. వా రామెను వెదకుచు వచ్చి సుగ్రీవునితో మైత్రి నెఱపిరి. 'సీతాదేవిని వెదకుం'డని యినజుండు మమ్ముం బంపె; దేశదేశంబులు వెదకితిమి; తుదకు సంపాతి చెప్పిన చొప్పున నే నిచ్చటికి వచ్చి లంక యంతయుం బరికించి తల్లీ! నేఁటికిచ్చో నిన్నుం గాంచితి" నని విన్నవించి మిన్నకుండె. హనుమంతుని మాటలు విని విస్మయంబున దిక్కులు చూచుచుండ, నొక వానరుండు తనకు నమస్కారంబు సేయుచు సీతకుం గాన్పించె. వాని శరీరం బశోకపుష్పముం బోలె రక్తవర్ణంబుగను నేత్రంబులు స్వర్ణవర్ణంబుగను నుండెను; మఱియు నతండు ధరించిన వస్త్రంబులు ధగద్ధగాయమానంబులై స్ఫటికవర్ణంబున నలరారుచుండె. హనుమంతునిం జూచి సీత ప్రథమంబున భయంపడెను గాని పిమ్మట దేవతలం దలంచుకొని "ఓ దేవతలారా! మీకు నమస్కారంబు. ఈ చిన్న వానరంబు సెప్పు విషయంబులు సత్యంబులే?" యని ప్రశ్నించె. అంతట హనుమంతుండు వృక్షంబునుండి దిగి వచ్చి సీతాదేవికిం బ్రణమిల్లి "అమ్మా! నీ పే రేమి? ఏ వెందుల కిచ్చో దుఃఖించుచున్నావు? తల్లీ! నీవే శ్రీరాముని యిల్లాలయిన సీత వైనచో నాకుం బ్రత్యుత్తరం బనుగ్రహింపు" మని ప్రార్థించె. అతని వాక్యంబు లాలించి సీతాదేవి "నేను దశరథపుత్త్రుం డగు శ్రీరామచంద్రుని ధర్మపత్నిని; నా జనకుండు జనకరాజేంద్రుండు. కైక యాజ్ఞ చొప్పున శ్రీరాముఁ డడవికిం బైలువెడల, నేనును నా మఱంది లక్ష్మణుండును నతనితో వనంబునకు వచ్చితిమి.

ఈ దుష్టరావణుండు నన్నుం బర్ణశాలయం దొంటిపాటున నున్న తఱి లంక కెత్తుకొని వచ్చె; మాసద్వయంబు గడచిన నన్నుం జంపఁ దలంచియున్నాఁ" డని పలికి, మరల సంశయించి రావణుండే యీ వేషంబున వచ్చి యిట్లు పల్కుచున్నాఁ డేమో యని యెంచి మనస్స్ఫూర్తిగ మాటలాడ భీతిల్లఁజొచ్చె. హనుమంతుం డామె భీతిని గ్రహించి "తల్లీ! భీతిల్లకుము. నేను మాయావిని గాను; దశరథతనయుని బంటను; సుగ్రీవుని సచివుండను; వాయుసూనుండ; నాంజనేయుం డనువాఁడ"నని యామెకు నచ్చఁజెప్పెను. అంత, సీత "ఓ కపివరా! నరులకు వానరులతోడ స్నేహం బెట్లు వాటిల్లె?" నని ప్రశ్నించె. "శ్రీరాముఁడు నిన్నుం గోల్పోయి వెదకుచు వచ్చి సుగ్రీవుని పరిచయంబు చేసికొని యతనిం గిష్కింధాపురాధీశ్వరుం జేసె. సుగ్రీవుండు భవదన్వేషణార్థమై నన్నుం బంపు తఱి శ్రీరాముఁడు తన వ్రేలి యుంగరంబును నీ కానవాలుగ నిమ్మనె" నని వచించి యా యుంగరంబును సీతాదేవి కొసంగెను. సీతాదేవి యా ముద్రికం జూచి హనుమంతుం జేరఁ బిలిచి "రఘుకులాంభోధిచంద్రుం డగు శ్రీరామచంద్రునకుం గుశలం బె కదా? సౌమిత్రి క్షేమంబున నున్నవాఁడె? నన్నీ క్రూరదానవులు హింసించి భక్షింపక మున్న యినకులతిలకుం డేతెంచి రావణుం బరిమార్చి నన్ను రక్షింపఁడా? సౌమిత్రికి నాయందు దయదప్పెనా యేమి? 'నేనతని నాడిన క్రూరవాక్యంబులు మనంబున నుంచుకొనవల' దని బోధించి 'మీ వదినెం గాపాడు' మని చెప్పుము. నేను జీవంబుతో నుండుట యిఁక రెండు మాసంబులు మాత్రమే.

ఈ గడువులోపల నే వారు తమ పౌరుషంబు వెల్లడించి యునద నగునన్ను రక్షింపఁగల్గుట. 'పిమ్మట మీరు శ్రమంపడవలసిన పనియే యుండ' దని యనేక ప్రకారంబుల శ్రీరామలక్ష్మణులకు నా మాటలుగ విన్నవింపు" మని ప్రార్థించి, మఱియుం గొన్ని ప్రశ్నంబు లడిగి హనుమంతునివలనం బ్రత్యుత్తరంబులం బడసె. పిమ్మట నాంజనేయుండు "తల్లీ! నీవు సమ్మతించెదవేని యిప్పుడ నిన్ను నాబుజంబుల నిడికొని శ్రీరామచంద్రుని సన్నిధానంబునకుం గొనిపోవఁజాలుదు"నని విన్నవించె. సీత యందుల కొప్పుకొనకపోవుటచే నతం డామెయొద్ద సెలవు గైకొనంబూని "రామచంద్రునకుం జూప నానవా లేదేని యొసంగు" మని యామె నభ్యర్థించెను. అంతట నామె తన వేణీభరంబునం బదిలపఱచి యుంచుకొన్న మానికంబు నానవాలుగ నొసంగెను. అనంతరము వాయునందనుండు ధరణీనందనయొద్ద సెలవు దీసికొని ప్రణతుండై బయలువెడలుచు 'క్షోణీసుతం గనుఁగొంటి. ఇఁక రాక్షసబలంబుల బలం బరయుదుం గాక! దీని కేమి యుపాయంబు? ఈ యశోకవనంబుం బాడుచేసినయెడ నాతో యుద్ధంబు సేయ రాక్షసు లేతెంతురు. అప్పుడ వారి పౌరుషంబు బయల్పడు' నని దలంచి యశోకవనం బంతయు ధ్వంసంబు సేయందొడంగె. హనుమంతుండు మనోహరం బగు నవ్వనంబునం గల ఫలవృక్షంబుల నన్నిటిం బెకలించి తోరణస్తంభం బెక్కి కూర్చుండె. వనవినాశనసమాచారంబు దైత్యభటులు తెలిసికొని రాక్షసనాథునికడ కరిగి "వాఁ డెవండో, రాముండు పంపినవాఁడు కానోపు. సీతతో మాటలాడి

యానె యున్న వృక్షంబు మాత్రము విడిచి తక్కిన యారా
మం బంతయు నొక్కండ పాడుసేసె" నని చెప్పిరి. దశకం
ఠుండు వారిమాటలు విని రోషావేశపరవశుండై పవనాత్మజు
నితో యుద్ధంబు సేయ ననేక రాక్షసవీరులం బంపె. ఏడుగురు
సైన్యాధిపతులును ఏడుగురు మంత్రిపుంగవులును హనుమం
తునిచే యమపురంబునకుం బంపఁబడిరి. దశకంఠుం డక్ష
కుమారునిం బంపె; వాఁడును వాతాత్మజునిచే నేలం గూలె.
కుమారు మరణముంగూర్చి విని కన్నుల నీరొలుక దుఃఖించి
యతండు మేఘనాదునిం బంపె. "నే నాకోఁతిం బట్టి తెచ్చె
ద" నని యింద్రజిత్తు శపథంబు పలికి రథారూఢుం డై
యుద్ధంబునకుం జని వాయుసూనునిపై నిశితాస్త్రంబులు
నఱపె. వాయుతనయుండు వాని రథరథ్యంబులం గూల్చె. మరి
యుపాయంబు గానక యింద్రజిత్తు బ్రహ్మాస్త్రంబుం బ్రయో
గించె. పవనపుత్త్రుం డా బ్రహ్మాస్త్రంబునకుం గట్టువడినంత నే
రాక్షసు లతనిని రజ్జుబద్ధునిం గావించి యసురేంద్రునికడకుం
దోడ్కొని పోయి చూపిరి. రాక్షసు లందఱు నింద్రజిత్తు
సామర్థ్యంబునకుం బరమానందభరితు లైరి. బ్రహ్మాస్త్ర
బంధనంబు వీడిపోయినను రాక్షసుల కది తెలియనీయక
మూర్ఛిలినవానివలెం బడియున్న తన్ను వా రెంత కొట్టి
యీడ్చి బాధించినను హనుమంతుండు కలంగక మెల్లగఁ
గనులు విచ్చి రావణుం జూడఁజొచ్చెను. స్వర్ణమయమకుటా
లంకృతుండును నవరత్నస్థగితసింహాసనాసీనుండు నగు దశకం
ఠుని భీకరాకారముం గాంచిన కొలంది నతని కద్భుతంబును
గోపంబును జనింపందొడంగె. రాక్షసులు బహువిధంబుల

ననిలాత్మజు బాధించుచున్న సమయంబున దానవమంత్రి యతనిం జూచి "వానరా! నీ విచ్చటి కెందులకు వచ్చితివి? ని న్నెవ్వరు పంపిరి? అశోకవనం బెందులకు నాశనంబు చేసితివి? దైత్యవరుల నెందులకు జంపితివి? నిజంబు వక్కాణింతువేని నిన్ను విడిపింతు" నని పలికెను. దానికిం బ్రత్యుత్తరంబుగా హనుమంతుండు రావణు నుద్దేశించి "ఓ దానవరాజా! నిజము చెప్పుచున్నాఁడను, వినుము. నేను సామాన్యవానరుండను; నిన్నుం జూడ నిందుల కేతెంచితిని; నీ దర్శనంబు దుర్లభం బగుటం జేసి నే నశోకవనంబు ధ్వంసంబు గావించితి. ఆ సమయంబునం బలువురు రాక్షసులు నన్నొక్కని స్రుక్కింపఁబోవ, వారిం జక్కాడితి. నేను శ్రీరాముని దూతను; వాయుకుమారుండను; ఆంజనేయుఁ డనువాఁడ. ఇంత ధనధాన్యసమృద్ధితోడను బుత్రమిత్రకళత్రాదిసంపత్తితోడను దులఁదూఁగు నీ వెందుల కన్యాయంబుగా సంచరించెదవు? నా మాట వినుము, నీ మంచికొఱకే చెప్పుచున్నాను. నీ విపుడేని బుద్ధి తెచ్చుకొని సీతను రామున కర్పింపుము. అర్పింపవేని నీకు మరణకాలం బాసన్నం బయిన దనుకొనుము. మా రాజేంద్రుండు నా కనుజ్ఞ యిచ్చియున్నచో నింతకుమున్న లంకాపట్టణంబును బాతాళంబునం గల్పియుందు" నని గంభీరోక్తులం బలికె. హనుమంతుని వాక్యంబులు విని రావణుండు నేత్రముల నిప్పులు రాల్చుచు "వీనిం జంపుఁ" డని రాక్షసుల కాజ్ఞాపించెను. రాక్షసులు వాయునందనుం జంపం బ్రయత్నించుచుండ, విభీషణుండు "దితికులచంద్రా! దూత

వధ్యుండు గాఁడు. వీనిం జంపిన రామలక్ష్మణుల కీ సమాచారం బెట్లు తెలియును? తెలియనిచో వా రిచ్చటి కెట్లు వచ్చి మన రాక్షసవీరుల శౌర్యముం గాంచఁగలరు? కావున వీని కేదేని యొక శిక్షం గావించి పంపుట యుచితం" బని యుపదేశించె. అంతట రావణుండు "దైత్యులారా! ఈ వానరంబు వాలంబున కగ్నిం దరికొల్పుం" డని యానతిచ్చె. తోడనే దైత్యవీరులు మితి లేని వస్త్రంబులం దెచ్చి తైలంబున ముంచి యాంజనేయుని వాలంబునకుం జుట్టసాగిరి. వారు తన వాలంబునకుఁ దైలవస్త్రంబులు చుట్టుచున్న కొలంది నతండు తోఁకం బొడిగింపఁ గడంగె. ఎన్ని వస్త్రంబులు చుట్టినను వాలంబునకుం జాలకుండె. ఇట్లు వారు చుట్టి నిండుగం దైలంబు పోసి దాని కనలజ్వాల లంటించిరి.

ప్రథమంబున నాంజనేయుండు ముందుచున్న వాలంబుతో రాక్షసులం గొట్ట మొదలుపెట్టెను. అతండు కొట్టుచున్న కొలంది వారు తోఁకకుం బుట్టంబులు చుట్టుచుండిరి. ఈ వార్త సీతాదేవికిం దెలిసి "నేను సుశీలనేని హనుమంతుని కగ్ని దేవుండు చల్లందన మొసంగుఁగాక!" యని ప్రార్థింపం దొడంగెను. తన వాలం బగ్ని విజృంభించి ప్రజ్వలించుచున్నను గాలక చల్లగా నుండుటం గాంచి 'యిది యంతయు సీతా రామలక్ష్మణుల యనుగ్రహంబే కాని వేఱొండు కా' దని భావించి హనుమంతుండు వారి నతిభక్తిమై సంస్మరించి తన దేహంబును సూక్ష్మంబు గావించుకొని రాక్షససమూహముం దప్పించుకొనిపోయి గంతులు వైచుచు నలుప్రక్కల నున్న యిండ్ల కెల్ల ని ప్పంటించెను. విభీషణుని మందిరంబు దక్కఁ

దక్కిన లంకాపురంబందలి గృహంబు లన్నియు దగ్ధంబు లయ్యె. అంతట హనుమంతుండు వేవేగ సీతకడ కేగి "దేవీ! యింక నేఁ బోయి వచ్చెద సెల వొసంగు" మన, నామె కనులం బాష్పంబులు రాల్చుచు "నిన్నుం జూచి నే నింత తడవు బ్రతికితిని. లేనియెడలం బ్రాణంబులు విడిచి యుందు"నని విలపింపందొడంగె. "తల్లీ ! యనుజ్ఞ యిత్తువేని నిన్ను శ్రీరాము సన్నిధిం జేర్చెద" నని యాంజనేయుండు పలుక, "నీవు వైళంబ చని 'వానరసేనాసమేతంబుగ వచ్చి రావణుని వధించి నన్నుం గొనిపొ' మ్మని శ్రీరామునితోఁ జెప్పుము. నే నంతవఱకు కట్లయిన నోర్చుకొని జీవించియుందు" నని సీత మాఱు వలికె. అది విని "మహాప్రసాదం" బని యాంజనేయుండు సీతాదేవియొద్ద సెలవుం గైకొని లంకాసమీపంబున నున్న యరిష్టపర్వతంబునకుం బోయె.

హనుమంతుని రాకకై నిరీక్షించుచుం గపు లందఱు మహేంద్రపర్వతంబుకడ నుండిరి. వారందఱుం దదేకదృష్టిం జూచుచుండ హనుమంతుం డాకస్మికంబుగ గరుత్మంతుండుం బోలె వచ్చి మహేంద్రగిరిం జేరె. వానరబలం బంతయుం దన క్షేమం బరయుచుండ "జనకజం గనుఁగొంటిని, లంకం గాల్చి వచ్చితిని. ఇఁక ధరణీకాంతుని చెంతకుం బోదము రం" డని యాంజనేయుం డందఱం గూడి పయనంబయ్యె. వారు వాయువేగంబునం గిష్కింధాపురంబు చేరి సమీపంబునం గల మధువనంబుం బ్రవేశించిరి. అంగదుం డందలి మధు వాస్వాదింపం దమ కనుజ్ఞ యొసంగ, స్వాదుఫలభరితం బగు

వేష్టించి వనచరానీకంబులు నడచుచుండె. ఇట్లు వా రరణ్యాంబులు సహార్యంబులుఁ దరువరంబులు వడివడిం దాఁటుచు గంతులు వైచుచు నిడుద వాలమ్ముల నిగిడించి ఫలంబులు మెక్కుచు మధుపానంబు సేయుచుఁ బుష్పసౌరభశోభం గాంచి యానందించుచు మహేంద్రపర్వతప్రాంతసముద్రతీరంబున కరిగిరి.

అక్కడ లంకేశ్వరుండు కడుంగడుఁ జింతాక్రాంతుండై మంత్రులఁ బిలిచి "సచివశేఖరులారా! నిన్న మారుతాత్మజుండు మహిమంబు మీఱ ఘటించిన కార్యంబుం జూచితిరి గదా! వాఁడు కొంచె మయినం జంకుగొంకులు లేక మన పురంబుం జొచ్చి యువనిజం గాంచి వనవినాశనం బొనరించి వైరులం ద్రుంచి లంకం గాల్చి పోయె. ఇఁక మన మేమి చేయుద?" మని ప్రశ్నించె. "లంకేశ్వరా! తొల్లి సమరంబున నమరులం గెల్చితివి. స్వర్గమర్త్యపాతాళంబులందు నీ సమానులు లేరు. వానరు లన నెంత వారు? మఱి, నరు లన్న నెంత వారు? ఊరక దీనాలాపంబు లేటి కాడెద?" వని మంత్రు లతనిం బురికొల్పిరి.

అంత గుంభకర్ణుండు వచ్చి "అన్నా! శ్రీరామపత్ని యగు సీతాదేవి నెందులకుం దెచ్చితివి? రాముని గెల్వ నేరికిం దరంబు గాదు. సీతాదేవిని శ్రీరామున కిచ్చివేయు" మని హితోపదేశంబు గావించె. అతని వచనంబులు విని మేఘనాదుండు "మనకు నరులుం గిరులుం గోఁతులుం గీఁతులు నెంత మాత్రము? నేను సురపతిం గెల్చిన శూరుండను; నా కిది యొక ఘనకార్యంబుగాదు. నేనిప్పుడ చని వారిం దెగటార్చెదం

జూడుఁ"డని ప్రగల్భంబులువల్కె. అంత విభీషణుండు "మహారాజా! రామునకు శక్తి లేనియెడ నతండు నీతో యుద్ధం బొనరింప నీ లంక కేల వచ్చును? అతని ప్రియపత్ని యగు సీతాదేవిం బ్రియంబున నతని కొసంగి నీవుం బ్రియుండవు కమ్ము. రాముండు సామాన్యుండు కాఁడు. నా మాట మన్నించి మహీజాతను విడువుము. లేనియెడం గులక్షయంబు సంప్రాప్తం బగు"నని నొక్కి వక్కాణించెను. అప్పు డసురేంద్రుం డుగ్రుం డై "ఓరీ! నా సమకూర్చు భోగంబు లెల్లం దెకతేర ననుభవించుచు మత్తిల్లి యిచ్చ వచ్చినట్లు ప్రేలఁజొచ్చితివా? 'దాయలే శత్రువు' లనెడి లోకోక్తి యథార్థం బయ్యె; ఇప్పుడే దశరథసుతుని తల ద్రుంచెదంజూడు" మని పరుషోక్తు లాడ మొదలిడెను. అంతట విభీషణుండు భీషణాకారుం డై "పితృతుల్యుండ వని ప్రియంబు దెలిపితి; నా తప్పు మన్నింపుము. నీ యిచ్చవచ్చినట్లు సేసికొ" మ్మని తన కాప్తమిత్రు లగు నల్వుర రాక్షసుల వెంట నిడుకొని జలధిం దాఁటి శ్రీరాముని కడ కేఁగెను. విభీషణుండు శ్రీరామునకు నమస్కరించి "నీ సతిని మ్రుచ్చిలిన పాపిష్ఠుండును నిర్భాగ్యుండు నగు దశకంఠుని తమ్ముఁడ; విభీషణుం డనువాఁడ. నీకు దాసుండ. నా యన్నతో భూజాతను సవినయంబుగ నీ కొసంగు మని చెప్ప, నతండు నన్నిలు వెడలంగొట్టి చంప నుంకించెను. నే నతనికి వెఱచి నీకడ కరుదెంచితి. నేను నిజంబుగ నిన్నుం జేర వచ్చితి. నీ కిష్టంబేని నన్ను నీయొద్ద నుండనిమ్ము. లేనియెడ నన్నుం జంపి పుణ్యపదవి యనుగ్రహింపు" మని యెంతయు వేఁడుకొనియె. "ఇనకులతిలకా! వీని మాటలు నమ్మకుము.

వీఁడు రావణుని సహోదరుండు. నీ యాజ్ఞ యైనచో వీని
నిప్పుడు వధింతు"నని సుగ్రీవుం డడ్డువలికె. అంత శ్రీరా
ముఁడు నవ్వుచు "శరణుఁ జొచ్చినవాని రక్షించుటయే నా
వ్రతంబు. ఇతండు బలవంతుం డనుభయం బెందులకు? ఎంతటి
దుష్టుం డయినను నన్ను వధించుట దుస్సాధ్యము. ఇతండువంట
యింటికుం దేలయ్యె. కావున మీ రితనికై యించుకేని భయం
పడవల"దని పలికి యప్పుడ విభీషణుని లంకకుం బట్టాభిషి
క్తునిఁ గావించె. అనంతరము సుగ్రీవహనుమదాదులు "విభీ
షణా! మహాశయా! ఈ సేనతో జలధిం దాఁటుట కుపాయం
బానతీయవే"యని యడిగిరి. "శ్రీరాముఁడు వారిధిం బూజిం
చిన, దాని దాఁటవచ్చు"నని విభీషణుండు మాఱువలికె.
అది విని వానరులు జలధితీరంబునం గుశాసనంబు వైచి
పూజాద్రవ్యంబులు సమకూర్చియుంచిరి. శ్రీరాముఁడు మహా
భక్తితాత్పర్యంబునఁ బూజించి జలధికిం బ్రణామం బర్పించి
నాలుగు దినంబులవఱ కధిదేవతాసాక్షాత్కారంబునకై వేచి
యుండెను. కాని, సముద్రుం డంతకుం గాన్పింపఁ డయ్యె.
అంతట శ్రీరాముఁ డాగ్రహపరవశుండై బ్రహ్మాస్త్రంబున
నుదధి నింకింప నుంకింప జగం బంతయు నల్లకల్లోలం
బయ్యె. దేవతలు భీతిల్లిరి. సముద్రుండు ప్రాణభయంబున
నతనియొద్ద కేతెంచి రత్నాంజలి సమర్పించి యతని సంతు
ష్టాంతరంగునిం జేసి కరంబులు ముకుళించి "అనఘా! నా
కుత్తరంబున దుర్మతులు గలరు. వారు రేయింబగళ్లు నన్ను
మిగుల బాధించుచున్నవారు. భువనేశా! నీ వట కేఁగి నీ
యస్త్రంబున వారిం దోరింపు"మని ప్రార్థించె. అంతట

శ్రీరాముఁడు వారిం దక్షిణంబ చంపెను. అపుడు ‘‘విశ్వకర్మ
పుత్త్రుం డగు నలుండు సేతుబంధనంబు గావించినచో మీరు
నన్నుం దాఁటఁగల” రని విన్నవించి సముద్రుం డదృశ్యుం
డయ్యెను. అంతట వానరు లందఱుం బెద్ద పెద్ద బండలను
మ్రాకులను దే నారంభించిరి. నలుం డద్భుతంబుగ నా శిలా
వృక్షంబులతో శతయోజనదూరం బగు సేతువు నిర్మించెను.
సేతునిర్మాణంబున కాఱు దినంబులు పట్టె. అనంతరము వన
చరు లెల్లరు సముద్రముం దాఁటి లంకాపురంబుం జేరిరి.
శ్రీరాముఁడు లంకం బ్రవేశించె' నను వార్త తెలిసినతోడనే
రావణుండు మంత్రు లగు-శుకసారణులం బిలిచి శ్రీరాముని
సైన్యంబును జూచి రం” డని పంపె. వారు వానరరూపం
బులం జన, విభీషణుండు వారిం బట్టుకొని శ్రీరామునికడకుం
దోడ్కొని పోయెను. శుకసారణులు ప్రాణంబులకుం దె
గించియే వచ్చిరి. దొంగ వేషంబులతో వచ్చెడివారిం జంపి
వేయుదు రని వారికిం దెలియును. వారు శ్రీరామునకు
మ్రొక్కి ‘‘మేము దశకంఠుని యాజ్ఞచే మీ సైన్యంబు
లెక్కింప నేతెంచితిమి. మమ్ము రక్షింపుఁ” డని వేఁడుకొనిరి.
అంతట శ్రీరాముఁడు మందహాసం బొలయ ‘‘మీరు భీతిల్ల
కుఁడు. మీరు సైన్యంబు లెక్కించినయెడ నిశ్చింతంబుగ మీ
ప్రభువు కడకుం బొండు. లేనియెడ లెక్కించుకొనియె పో
వచ్చు” నని వారి కభయుం బొసంగె. వారు శ్రీరామునిం
గొండాడుచు రావణునికడ కేఁగి ‘‘మహారాజా! యుద్ధంబు
వలన నేమియు లాభంబు కలుగదు. వారు మహాశూరులు.
సీతాదేవిని శ్రీరామున కిచ్చివేయు” మని విన్నవించిరి.

రావణుండు "మీా రెందులకు భయంపడుచున్నారు? ఈ లోకంబున నన్నెవరయిన జయింపఁగలరా?" యని బీరంబులు పల్కి వారితోఁ దన మేడ యెక్కి శ్రీరాముని సైన్యంబుం జూడసాగెను. అసంఖ్యాకమైన యరాతిసైన్యంబు గనుంగొని సుగ్రీవాంగద రామలక్ష్మణహనుమదాదుల పరాక్రమక్రమంబు విని దశకంఠుండు హృదయంబున భయంబందియు భయచిహ్నంబు లణుమాత్రంబును ముఖంబునం గాఁపనీయక యాగ్రహోదగ్రుండై "మీారు వట్టి పిటికి పందలు. ఈ సేనం జూచియా యింత భీతిల్లితి?" రని వారిం దిట్టి యక్కడనుండి పంపివైచెను. అనంతరము రావణుండు విద్యుజ్జిహ్వుం డను రాక్షసమాంత్రికుని రావించి "శ్రీరాముని శిరస్సువంటి శిరస్సును అతని ధనుర్బాణముల వంటి ధనుర్బాణంబులను జేసి తె" మ్మని యాజ్ఞాపించె. వాఁడు వాని నట్లే చేసి యొసంగె. అపు డా కృత్రిమశిరంబును ధనుర్బాణంబులను సీతయొద్దకుం గొనిపోయి "ఇదిగో కడచిన రాత్రి నిద్రించుచుండ నీ నాథునిం జంపితిమి. లక్ష్మణుండు పాఱిపోయెను. హనుమదాదులు చచ్చి పడియున్నవారు. విభీషణుం బట్టి తెచ్చితిమి. ఇంక రామునికై విచారించి యేమి చేయంగల?" వని రావణుండు నిపుణంబుగ నామెను బెదరించె. ఆ కఠినోక్తు లాలించినంతనె యా సాధ్వీమణి యట్టె మూర్ఛిల్లి కొంతవడికిం దెలిసి దురంతసంతాపంబున హృదయంబు వ్రయ్య శోకింపనారంభించెను. అంతలో నొక పరిచారకుండు వచ్చి రావణునిం దోడ్కొనిపోయెను. రావణాజ్ఞాతయై సీతయొద్ద నున్న విభీషణపత్ని సరమ సీతాదేవిం

జాలఁ బ్రేమించునది. రావణుండు వెడలఁగనే, శ్రీరాముఁడు మృతినొందలేదనియు యుద్ధంబు కాలేదనియు రాక్షసులు యుద్ధంబు సేయుటకు భయంపడుచున్నారనియుఁ జెప్పి సరమ యామె నోదార్చెను. ఇట్లు వా రిరువురు మాటలాడుచుండఁగనే వానర సింహనాదంబులు వినిపించెను.

శ్రీరాముని సైన్యంబు విడిసియున్న స్థలంబునకు సమీపంబుననే యొక పర్వతంబు గలదు. అచటనే వారు యుద్ధమునకుం బూర్వరాత్రంబు గడపిరి. అక్కడనుండి లంకాపట్టణం బంతయు వారికిం గాన్పించుచుండె. మఱునాఁడు ప్రాతఃకాలము రావణుం డుత్తరద్వారంబున నిలువంబడియుండ, వానిం జూచి సుగ్రీవుండు సహింపలేక వానియొద్ద కేఁగి వానితో మల్లయుద్ధముం జేసి మరలి వచ్చెను. రావణుండు లజ్జచే మాటాడ కూరకుండెను. శ్రీరామసైన్యంబు పర్వతంబు దిగి లంకాసింహద్వారంబుకడ కేఁగి నలుదిక్కులు ముట్టడింపఁదొడంగె. రామలక్ష్మణు లుత్తరద్వారంబుకడను నీలాదులు తూర్పుదిక్కునను హనుమంతుండు పశ్చిమద్వారంబునను సుగ్రీవుండు దక్షిణద్వారంబునను రావణుని మార్కొన వేచియుండిరి. అప్పు డంగదుండు రావణుని సభకు రాయబారిగం బోయె. రావణుండు, బంధుమిత్రసభ్యులతో పేరోలగంబుండ, నంగదుండు చని రావణునితో "నేను శ్రీరాముని దూత, నంగదుం డనువాఁడను; వాలి పుత్త్రుండను. నా తండ్రి యింకను నీ జ్ఞప్తియం దుండవచ్చును. 'సత్వరంబుగ వచ్చి యుద్ధంబు సేయు' మని శ్రీరాముఁడు నిన్నుం

గోరుచున్నాఁడు. నిన్ను వధించి విభీషణుని రాజుం జేయ నున్నాఁ” డని తెలియఁబలికెను.

అంగదుండు రావణునితోఁ దన తండ్రి మాటం జెప్పుచు “మా తండ్రి యింకను నీ జ్ఞప్తియం దుండవచ్చు” నని యెత్తిపొడుచుటకుం గారణంబు గలదు. ఒక పర్యాయంబు వాలి రావణు నోడించెను. రావణుండు మూఁడు లోకంబులలో జయంబు గాంచుచుండుటచే నెవ్వరు వానితో యుద్ధంబు సేయుటకు సాహసించెడివారు కారు. ఒకానొకదిసంబున నెవరుం దనతో యుద్ధంబు సేయువారు లేమిం జేసి వాలి సంధ్యావందనంబు సేయుచుండ రావణుండు వెనుక వైపున నిలిచి వానిఁబట్టుకొనం బ్రయత్నించెను. అపుడు వాలి రావణుని యిరువది చేతుల నిరు కక్షల నిఱికించుకొని నాల్గు సంద్రంబులకుం జని రావణుతోడన క్రుంకులిడెను. రావణుం డుచ్ఛ్వాస నిశ్వాసంబుల కవకాశంబు లేక చాలఁ గష్టపడియె. కాని, బ్రహ్మవరంబునం జేసి మృతి నొందఁడయ్యె.

అంగదుని యీ యెత్తిపొడుపు మాటలు విని రావణుం డాగ్రహించి వానిం జంప దైత్యుల కాజ్ఞాపించె. వెంటనే దైత్యవీరులు తన్నుం బట్టుకొనఁబోవ నంగదకుమారుండు తానె దైత్యవీరులం బట్టుకొని యొక మేడమీఁదికిం దీసికొని పోయి యందఱి నచ్చటినుండి నేలం బడవైచి చంపి యా మేడ యంతయు ధ్వంసం బొనర్చి శ్రీరామునికడకు మరలి చనియె. అంత, నుభయపక్షంబులవారును ఘోరంబుగ యుద్ధంబు సేయఁ గడంగిరి. సంఖ్యాతీతంబుగ రాత్రించరులును వనచరులును మృతి నందిరి. కళేబరంబులు పర్వతం

బులవలెం బడియుండె. వాని ప్రక్క రక్తంబు కాలువ లయి ప్రవహింపందొడంగె. యుద్ధంబున కంతంబు లేకపోయె.

రావణసేనాధిపతు లేవు రసంఖ్యాకం బగు సైన్యంబుతో వానరసేనం బ్రతిరోధింప మొదలుపెట్టిరి. రాక్షసులు సింహనాదంబులు సేయుచు నతిభయానకంబుగఁ బోరఁ జొచ్చిరి గాని శ్రీరామునితో యుద్ధంబు సేయంజాలక తుదకుఁ బాఱిపోయిరి. అంగదుఁడును మేఘనాదుండును ఘోరంబుగఁ బోరసాగిరి. అంగదుం డింద్రజిత్తు రథంబుం బడఁ దన్నె. భూతలసంగ్రామంబున నతని జయింపంజాలనని యెంచి మేఘనాదుండు మేఘమధ్యమునుండి మాయాసంగర మొనర్పసాగెను. అందఱు వానికిం గాన్పింతురు కాని వాఁ డెవ్వరికిం గాన్పింపఁడు. వాఁ డిట్లు మఱుఁగువడి తేజోమయంబులగు బాణంబుల శత్రువీరులపైఁ గురియింపసాగెను. తుదకు వాఁడు రామలక్ష్మణులపై నాగాస్త్రముం బ్రయోగించెను. ఆ బాణంబు మహాభయంకర సర్పరూపంబులు దాల్చి వారిం గట్టిగఁ బట్టుకొనెను. ఇంద్రజిత్తు కాన్పింపకుండుటవలన వారేమియుం జేయఁజాలరైరి. ఇట్లు వాఁడు రామలక్ష్మణుల నాగపాశబద్ధులం జేసి బహు బాణపరంపరలచే బాధించి మూర్ఛితులం గావించె. అమ్మూర్ఛితులను 'మృతులుగా బ్రమసి బహు సంభ్రమంబునం బోయి యింద్రజిత్తు రావణునితో "రామలక్ష్మణులం జంపితి" నని చెప్పెను.

ఇట సుగ్రీవుఁడు విభీషణుఁడు అంగదుఁడు హనుమంతుఁడు జాంబవంతుఁడు మున్నగువారు నేల నొరగియున్న రామలక్ష్మణులం గనుంగొని యేడువఁదొడంగిరి. వానరులలో

సుషేణుం డను రణవైద్యుండు హనుమంతునిం జూచి "క్షీరసాగరతీరంబున విశల్యకరణి సంజీవకరణి యను రెండోషధులు గలవు. చంద్రద్రోణపర్వతంబులపై నవి లభించును. వానిం దెచ్చిన, రామలక్ష్మణుల సచేతనులం గావింపవచ్చు" నని యుపదేశించె. అంతలో ఝంఝామారుతంబు వీవం దొడంగె. భూమి కంపింపసాగె. ఖగంబులు నీడంబులం జేరం బాఱె. జలచరంబు లన్నియు భయంపడి కదలకుండె. ఇట్టి యాకస్మికసంక్షోభంబునకుం గారణం బే మని యెల్లరుం జోద్యం బంది చూచుచుండ, గరుడుండు రామలక్ష్మణు లున్న యెడకొక్క పర్యాన విచ్చేసె. వెంటనే సర్పంబులు భీతిల్లి రామలక్ష్మణులను విడిచి తిరిగి చూడక పాఱిపోయెను! గరుత్మంతుండు రామలక్ష్మణుల స్పృశించినంతనే, వారు నిద్రనుండి మేల్కాంచినట్లు లేచిరి. అంత, శ్రీరాముఁడు గరుత్మంతునిం గాంచి "పక్షీంద్రా! నీ వెవ్వండవు? మహావిపదంభోధినుండి మమ్ము దరిఁ జేర్చితి" వని యభినందించె. "రామచంద్రా! నాపేరు వైనతేయుండు. మి మ్మింద్రజిత్తు నాగపాశంబుచే బంధించె నని విని వచ్చితిని. మీయెడ నాకు భక్తి మెండు. ఈ యుద్ధంబున మీరే జయించెదరు. అందులకు సందేహంబు లే" దని గరుత్మంతుండు వెడలిపోయె. అంతఁ గపివరులు మితి మీఱిన యానందంబు నొంది కోలాహలంబులతో లంకం గంపింపఁజేయ మొదలు వెట్టిరి. 'రామలక్ష్మణులు మృతి నొందియు వానరు లెందుల కానందించుచున్నవారో' యని శంకించి దశకంఠుండు "వారిం జూచి రం" డని తన పరిచారకులం బంపె. వారు "రామలక్ష్మణులు సజీవులై సుఖం

బున్నా” రని తెలుప, రావణుండు మరల భయంపడఁ దొడంగెను.

ధూమ్రాక్షుం డను రాక్షసవీరుని రావణుండు వానరులతో యుద్ధంబు సేయుటకుఁ బంపె. వాని ముఖంబు ఖరసింహవ్యాఘ్రముఖంబులు గలసిన ట్లుండెను. రాక్షసులు వానరులతోఁ బోరాడ లేకుండుటం జూచి తానే వారిం దఱిమివైచి ధూమ్రాక్షుండు హనుమంతునితో యుద్ధంబు సేయ నుపక్రమించెను. మరున్నందనుం డందఱిం బురిగొని యొకపర్వతశిఖరంబును విఱిచి పైవైచి ధూమ్రాక్షునిం జంపె. ఇట్లు మర్కటవీరులచే ననేకు లగు రాక్షసులు మడిసిరి. రాక్షసమరణంబు వానరుల కపరిమితానందదాయకంబయ్యె. ఇట్లానందకందళితహృదయారవిందంబులతోఁ గపిసేన చెలంగుచుండ, లెక్కలేని రక్కసిమూఁక లుక్కుమిగిలి యొక్కపరి జన్యంబు సేయ నేతెంచెను. దశరథసుతుండు విభీషణుం గాంచి “యీ వచ్చిన వా రెవ్వ?” రని యడుగ, నతం డా రక్షస్సేనాధిపతులం గూర్చి పేరుపేరు వరుసం జెప్పెను. ఆ సైన్యంబున దశగ్రీవుండు గూడ నుండుట నెఱింగి సీతానాథుం డానందపరవశుం డయ్యె. రావణునిం జూడఁగనే సుగ్రీవుండు క్రుద్ధుండై యొక పర్వతశిఖరంబుతో నతనిం గొట్టెను. రావణుం డా పర్వతశిఖరంబు భేదిల్లున ట్లొక సాయకం బేయ నది తగిలి సుగ్రీవుండు మూర్ఛిల్లెను. అంత సుషేణుండు మొదలగు వానరవీరులు కొందఱు ఘోరంబుగఁ బోరాడిరి కాని, రావణుని బాణపరంపరలకుం దాళఁజాలక పోయిరి.

శ్రీరాముఁడు యుద్ధసన్నద్ధుం డగుడు, లక్ష్మణుండు తానే రావణునితోఁ బోరాడెద నని పలికెను. వా రిరువురుం జాలఁ దడ వాయోధనం బొనరించిరి. తుదకు రావణుండు నిస్స్పృహుం డై సౌమిత్రిపై నొక శక్తిం బ్రయోగించె. దానం జేసి సౌమిత్రి మూర్ఛాగతుం డయ్యె. రావణుండు నిశ్చేష్టితుఁడై పడియున్న లక్ష్మణుం గొనిపోవఁ బ్రయత్నించెం గాని యతని కాయంబును గదల్ప లేకపోయెను. అపుడు హనుమంతుం డేతెంచి రావణుని వక్షంబు పిడికిటం బొడిచి, యొడలు దెలియక పడియున్న సుమిత్రానందను నెత్తుకొని పోయెను. నీలుం డతిసూక్ష్మరూపం బూని రథమునుండి కిరీటంబుపైకిని గిరీటంబునుండి ధనుర్బాణంబులమీఁదికిని దుముకుచు రావణు నస్థిరునిం జేయ నారంభించెను.

లక్ష్మణాగ్రజుండు తానే యుద్ధంబు సేయఁబోవుచున్నాఁ డని హనుమంతుం డతనిం దన వీఁపున నెక్కించుకొని పోయెను. వాతాత్మజునిపై దశకంఠునకుఁ గోపంబు మెండు. రావణుం డనేక సాయకశతంబుల నతనిపై ధారాపాతంబుగఁ బఱపె. కాని, యించుకయు లాభంబు లేకపోయెను. శ్రీరాముఁడు రావణుని రథంబును రథ్యంబులను సారథిని నుగ్గునూచంబు గావించెను. వాని కిరీటంబు గూడఁ జిందఱవందఱయై నేలపా లయ్యెను. రావణుండు మిగుల నలసి బాణంబులు పాణిం బట్టఁజాలకుండెను. రఘుకులేశ్వరుం డది గాంచి "నీవు శ్రమఁ జెందిన ట్లున్నాఁడవు. నేఁటికి నిన్ను విడిచితిని. ఇంటికిం బోయి విశ్రాంతిం బొందుము. మఱియొక దినంబు నీ బలంబు చూచెద" నని హెచ్చరించె. అసురేశ్వరుం డది విని సిగ్గుచేఁ దల

వంచుకొని లంకాపురంబుం బ్రవేశించెను. అతండు నగరునకుం
జని నలుదిక్కుల రక్కసులు నిలువంబడియుండ సింహాసనా
సీనుండై దీర్ఘంబుగ నాలోచించి వితర్కించి తల పంకించి
"త్రిలోకంబుల జయించి తుదకు సామాన్యనరుని హస్తంబుల
నస్తమింపనున్నాఁడ. పూర్వము నాతపంబునకు మెచ్చి బ్రహ్మ
వరంబు లిచ్చుచు నేఁ గోరిన తీరున దేవదానవయక్షులు
నన్నుం జంపకుండునట్లనుగ్రహించె. మనుష్యుల మాట నే
నప్పుడు తలంపలేదు. సామాన్యమానవు లిట్లు భయంకరు
లయ్యెద రని కలనైనఁ దలంపనైతి. అందువలననే యీ
విపత్తు సంభవించినది. మీరు చని కుంభకర్ణుని మేల్కొలు
పుఁడు. వాఁ డయిన రామలక్ష్మణులం జంపఁగలం డేమో"
యని రావణుండు పరివారజనంబుల హెచ్చరించెను.

కుంభకర్ణుండు రావణుని సహోదరుండు. వీరు
మువ్వు రన్నదమ్ములు. రావణుండు జ్యేష్ఠుండు, కుంభకర్ణుండు
ద్వితీయుండు, విభీషణుండు కనిష్ఠుండు. "ఇంటిగుట్టు లంకకుఁ
జే" టను సామెత యీ విభీషణునివలననే కలిగెను. ఈయన్న
దమ్ములకుం దండ్రి విశ్రవసుండు, తల్లి కైకేసి. వీరికిఁ గుబే
రుం డను నింకొక సోదరుండు కలఁడు. విశ్రవసుండు భార్య
యగు కైకేసితో "రావణకుంభకర్ణులు భయంకరు లగు
రాక్షసు లయ్యెదరు. విభీషణుండు ధార్మికుం డగు" నని
పూర్వమే చెప్పియుండె. అట్లే వా రాజన్మాంతము ప్రవర్తించు
చుండిరి.

రావణకుంభకర్ణులు పెట్టు బాధలం బ్రజలు సహింపఁ
జాల కుండెడివారు. వీరి యిరువురిలోఁ గుంభకర్ణుండు మహా

భయంకరుండు. కైకేసి కుబేరునిం జూపి "రావణా! చూడు
వాఁ డెంత యోగ్యుఁడో? నీ విట్లయితి వెందుల?" కని ఖేదో
పాయంబునం దనయుని మందలింపఁ, "దల్లీ! నే నంతకన్నను
మంచివాఁడ నయ్యెదం జూడు" మని యతండు మాఱు పలికి
కుంభకర్ణవిభీషణసమేతంబుగాఁ దపంబు సేయ మొదలు
పెట్టెను. పదివేల సంవత్సరంబులు విరించిం గురించి తపంబు
సేయ నతండు సంతుష్టాంతరంగుం డై సాక్షాత్కరించి
"రావణా! నీ తపస్సున కానందించితి. వరంబు గోరుకొను
మొసంగెద" నని యనుగ్రహించె. "దేవా! నాకుం జావు లేని
వరంబు ప్రసాదింపు" మని రావణుండు వేఁడికొనియె. అంతటఁ
బితామహుండు "నీకు నే నావరం బీయంజాల; మఱియొండు
వరంబు వేఁడుకొ" మ్మనియె. "హిరణ్యగర్భా! అటు లేని, సర్ప
యక్షరాక్షస దేవతాగణంబు నన్నుం జంపకుండఁ బ్రసాదిం
పుము. నరులకు నితరజంతువులకు భయం బందువాఁడఁ గా"
నని రావణుండు మరలఁ బ్రార్థించె. "అట్లే యగుంగాక!
మఱియు నీవు నీయిచ్చవచ్చిన వేషంబు ధరింపంజాలియుందు"
వని పరమేష్ఠి వాని ధన్యునిం జేసి, విభీషణు ప్రార్థన ననుసరించి
యతని కెల్లప్పుడు ధర్మంబునందు నీశ్వరునియందు బుద్ధి
నిలుచునట్లును అమరత్వంబు సిద్ధించునట్లును వరం బొసంగె.
సురజ్యేష్ఠుండు కుంభకర్ణు నొద్దకుం బోయి వరంబు లిచ్చు
తఱి దేవత లందఱుం గూడి "వానికి వరంబు లొసంగవల"
దని యతని వేఁడికొనిరి. ముందే యింద్రుం డప్సరోగణం
బును భృత్యులను బంపి కుంభకర్ణతపోభంగంబునకుం బ్రయ
త్నించి విఫల మనోరథుం డై దేవహితంబుగ సరస్వతీదేవి

కుంభకర్ణునకు బుద్ధిమాంద్యంబు ఘటింపం బ్రార్థించె. సరస్వతియు ననువర్తించెను. బ్రహ్మ "వరంబు వేఁడు" మని యడుగ "నా కెప్పుడును నిద్రయ కావలయు" నని కుంభకర్ణుండు గోరుకొనియె. వాఁడు 'నిర్దయ' గోరఁబోయి సరస్వతీతంత్రంబువలన 'నిద్రయ' కావలయు ననియె. అంతట లోకేశుండు తన కట్టులె వరంబు ప్రసాదింప నప్పటినుండియు వాఁడు నిద్రాదేవి తల కెక్కి తాండవ మాడ నొడ లెఱుంగక పడియుండెడువాఁడు. అట్లు గాఢనిద్రాపరవశుం డై యున్న కుంభకర్ణుని లేపుటకై రావణాజ్ఞాతు లైన క్రవ్యాదులు వెడలిరి. ఒక పర్వతగుహాంతరంబు కుంభకర్ణుని నివాసస్థలము. అది యోజనైకవిస్తీర్ణము. హేమమయపర్యంకంబున నిద్రించుచున్న యతనిని మేలుకొలుపుటకై వారు సహస్రగజంబులచేతను సహస్రహయంబులచేతను ద్రొక్కించిరి. శంఖనాదంబులును భేరీభాంకారంబులును గావించిరి. శరీరంబునఁ జందనం బలంది ధూపంబున గుహ యంతయు నిండి ఘుమ్మనునట్లు చేసిరి. అంతటఁ దన శరీరము నెవ్వరో నెమ్మదిగ నొత్తుచున్నట్లు స్ఫురింప వాఁడు కొంచె మొత్తిగిలి కనులు దెఱచెను. నిద్ర లేచునప్పటికి కుంభకర్ణుండు మిక్కిలి యాఁకొనియుండు నని గ్రహించి వానియొద్ద ననేకజంతువులను రక్తకలశంబులను నుంచి వాఁడు లేచిన వెంటనే వాని కాయాహారపదార్థంబులం జూపి రాక్షసులు దూరంబుగఁ దొలంగి నిలిచిరి. వాఁ డన్నిటిని భక్షించి "మీ రందఱు నిట్లేతెంచి నన్నుం బ్రబోధించుటకుఁ గారణం బే?" మని యడిగె. అంత రాక్షసులు "నరవానరులు వచ్చి లంకాపురంబు ధ్వం

సంబు చేయుచున్నా" రని చెప్పిరి. "ఇప్పుడే నేన
రులం జంపెద"నని కుంభకర్ణుండు పయనంబయ్యె. "అయ్యా
ముందుగ మీ యన్నను సందర్శించి తరువాత యుద్ధంబు
నకుం బొం" డని రాక్షసులు విన్నవించిరి. కుంభకర్ణుండు
రావణుని దగ్గఱకుం బైలుదేఱె. వానిని వానరవీరు లందఱుం
జూచి "ఆహా! ఇది యేదో పర్వతంబు నడచుచున్నట్టు లున్న
ది. ఆకృతియు వికారంబుగ నున్న" దని భయంపడి నలు
దెసలకుం బరువులెత్తిరి. కొందఱు శ్రీరాముని మఱుంగు
చేరిరి. మఱికొంద ఱెచ్చటికో పాఱిపోయిరి. శ్రీరాముఁడు
విభీషణుం జూచి "వీడు రాక్షసుండా లేక రాక్షసియా?"
యని ప్రశ్నించె. అతండు తన యన్న యగు కుంభకర్ణుని
చరిత్రం బంతయు శ్రీరామున కెఱింగించెను. అంత శ్రీరా
ముఁడు వానరుల నందఱి. 'నత్యంతజాగరూకతతో నుండుఁ' డని
హెచ్చరించెను. కుంభకర్ణుండు దైత్యవల్లభుని యంతికంబు
నకుం జని "మహారాజా! న న్నెందులకు లేపితి?" రని ప్రశ్నిం
చెను. "తమ్ముఁడా! నీ కెల్లప్పుడు నిద్ర యే కాని మఱేమియుం
దెలియదు. లంక పొంకం బఱంగినది. రక్షోవీరు లందఱు
రామశరానలంబునం బడి నశించిరి. ఇవుడు లంకాపురంబున
వీ...లే కాన్పింపకున్నారు. అందువలన నిన్ను లేపితిమి. నీవు
శత్రువులం జంపిన మన ప్రాణంబులు నిలువఁగల" వని రావ
ణుండు నిట్టూర్పు నిగిడ్చె. "అన్నా! నీవు దూర మాలోచింప
కింతటి చేటు చేఁజేతఁ దెచ్చుకొంటివి. ఎంద ఱెంత యుపదే
శించినను చెవిం బెట్టవైతివి. విభీషణుండు చెప్పిన రీతిం జేసిన
మన కీ యాపద సంభవింప...